RNI : TGTEL/25/A0357
ప్రజా గళం మా కలం.....
www.tolivaartha.com
# తొలివార్త
తెలుగు దిన పత్రిక
www.epaper.tolivaartha.com

ప్రచురణ : రంగారెడ్డి ఎడిటర్ : లింగాల నరేందర్ గౌడ్ సంపుటి : 02 సంచిక : 146 గురువారం 01 - 10 - 2026 వెల : 4/- పేజిలు : 08

Published From : Rangareddy , Circulated at : Hyderabad, Medchal, Malkajgiri, Suryapet, Nalgonda, Jangaon Khammam, Mahaboobnagar, Narayanpet, Warangal , Mancherial







## పేరు మార్చినంత మాత్రాన సిద్ధాంతం, నాయకత్వం మారదు



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తెలుగు గడ్డపై పుట్టిన పార్టీ జాతీయ స్థాయికి ఎందుకు విస్తరించకూడదన్న కేటీఆర్
- నా పేరు షారుఖ్ ఖాన్ అని పెట్టుకుంటే షారుఖ్ అవుతానా? అని ప్రశ్న
- తదుపరి సీఎం కేసీఆర్ అని ధీమా

**తొలివార్త, హైదరాబాద్, సెప్టెంబర్ 30 :** పార్టీ పేరును టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మార్చినంత మాత్రాన తమ సిద్ధాంతం, ఆలోచనా విధానం, నాయకత్వం మారబోవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ - మిగతా 2 లో

### సమస్యల పరిష్కారానికి కేంద్రం వద్దకు

# ఎన్నిసార్లయినా వెళ్తాం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మూడు శాతం ఉద్యోగులు 97 శాతం ప్రజలకు సేవ చేయడం శ్రమతో కూడిన పని అని రేవంత్ రెడ్డి తెలిపారు
- కరీంనగర్ సమీకృత కలెక్టరేట్ ఎదుట తెలంగాణ తల్లి విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు



**తొలివార్త, హైదరాబాద్, సెప్టెంబర్ 30 :** పేదల సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ కార్యాలయం ఉపయోగపడాలని, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలంటే ఉద్యోగులే ప్రభుత్వ ప్రతినిధులని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సహాయం కోసం వచ్చిన వాళ్లను మన కుటుంబసభ్యుల్లా చూడాలని కోరారు. కరీంనగర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించారు. కరీంనగర్ సమీకృత కలెక్టరేట్ ఎదుట తెలంగాణ తల్లి విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. కరీంనగర్ కలెక్టరేట్ నూతన భవన సముదాయం ప్రారంభంతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.అందరి సహకారంతోనే సమస్యలు పరిష్కరిస్తూ ప్రభుత్వం ముందుకెళ్తోందన్న సీఎం, ఇంకా సమస్యలున్నాయని ప్రజలకు సేవలందిస్తూనే సమస్యలు పరిష్కరించుకోవాలని ఉద్యోగులను ఆదేశించారు. 10.5 లక్షల ప్రభుత్వ ఉద్యోగులే 4 కోట్ల ప్రజలకు సేవలందిస్తున్నారని, మూడు శాతం ఉద్యోగులు 97 శాతం ప్రజలకు సేవ చేయడం శ్రమతో కూడిన పని అని తెలిపారు. ప్రభుత్వానికి మంచి పేరు వచ్చినా, చెడు పేరు వచ్చినా ప్రభుత్వ ఉద్యోగుల వల్లేనని స్పష్టం - మిగతా 2 లో

## కాంగ్రెస్‌ను నిలదీసిన కవిత



- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులపై దుమారం
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన
- రెండు స్థానాల్లోనూ రెడ్డి సామాజిక వర్గానికే అవకాశం
- ఇది సామాజిక అన్యాయమంటూ కవిత తీవ్ర విమర్శ

**తొలివార్త, హైదరాబాద్, సెప్టెంబర్ 30 :** తెలంగాణలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థుల విషయంలో కాంగ్రెస్ పార్టీపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర విమర్శలు - మిగతా 2 లో



## హైదరాబాద్‌లో ప్రతి 100 మందికి 70 వాహనాలు

- గత్యంతరం లేకే వాహనాలు కొంటున్నారు - జయప్రకాశ్ నారాయణ
- హైదరాబాద్ ట్రాఫిక్‌పై లోక్‌సత్తా అధినేత జేపీ కీలక వ్యాఖ్యలు
- ప్రపంచంలోని సంపన్న నగరాల కంటే హైదరాబాద్‌లోనే ప్రైవేట్ వాహనాలు ఎక్కువ
- ఫస్ట్, లాస్ట్ మైల్ కనెక్టివిటీ లేకపోవడంతోనే ప్రజలు సొంత వాహనాలను వాడుతున్నారని వెల్లడి
- ప్రతి 100 మందికి 70 వాహనాలు ఉండటం ఆందోళనకరమన్న జయప్రకాశ్ నారాయణ

**తొలివార్త, హైదరాబాద్, సెప్టెంబర్ 30 :** హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ తీవ్రమవుతున్న ట్రాఫిక్ రద్దీ, వాయు కాలుష్యంపై లోక్‌సత్తా పార్టీ అధినేత, మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ జయప్రకాశ్ నారాయణ కీలక విశ్లేషణ - మిగతా 2 లో

## అక్టోబర్2 నుంచి 'సేవ్ డెమోక్రసీ' యాత్ర




- ఉద్యమ కార్యాచరణను ఖరారు చేసిన ఇండీ కూటమి
- అక్టోబర్ 6న ఈసీ కార్యాలయం వరకు విపక్ష ఎంపీల ప్రదర్శన
- విపక్ష ఎంపీలు ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపిన మల్లికార్జున ఖర్గే
- సర్ ప్రక్రియకు ముందున్న ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసిన కూటమి

**తొలివార్త, ఢిల్లీ, సెప్టెంబర్ 30 :** ఓటరు జాబితా సవరణలో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళనలకు ఇండియా కూటమి సిద్ధమైంది. ఈ మేరకు దిల్లీలో నిర్వహించిన సమావేశంలో ఉద్యమ కార్యాచరణను ఖరారు చేసింది. యువత, ఎన్జీవోలను కలుపుకుని అక్టోబర్ 2 నుంచి 8 వరకు ప్రజాస్వామ్య పరిరక్షణ యాత్రలు చేపట్టనున్నారు. అలాగే జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేయనున్నారు. అక్టోబర్ 6న విపక్ష ఎంపీలంతా ఎన్నికల సంఘం కార్యాలయం - మిగతా 2 లో

## ఆసియా క్రీడల్లో ఆర్చర్ చికితకు ఒకేరోజు రెండు స్వర్ణాలు

- సీఎం రేవంత్ రెడ్డి అభినందన
- ఆసియా క్రీడల్లో తెలంగాణ ఆర్చర్ చికితకు రెండు స్వర్ణాలు
- చికితను అభినందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- పెద్దపల్లి జిల్లాకు చెందిన క్రీడాకారిణి చికిత

2 లో..



# పేదల సంతోషమే నిజమైన అభివృద్ధి

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం స్వర్ణాంధ్ర సాధనకు తొలి మెట్టు
- పేదలందరూ ఆనందంగా ఉంటే అదే నిజమైన అభివృద్ధి అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు
- అలాంటి అభివృద్ధి సాధించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు
- ప్రతి పేదవారికీ గృహకల్పనతో శాశ్వత భద్రత కల్పించడాన్ని బాధ్యతగా తీసుకున్నామన్నారు



**తొలివార్త, అమరావతి, సెప్టెంబర్ 30 :** సంక్షేమం, అభివృద్ధి, సంపద సృష్టి, నిరంతరం జరగాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. పెట్టుబడులు తెచ్చి యువతకు ఉపాధి కల్పిస్తున్నామని చెప్పారు. ప్రాజెక్టులు పూర్తి చేస్తున్నామని పంటలకు నీళ్లు ఇస్తున్నామని తెలిపారు. రాయలసీమ హార్టీకల్చర్ హబ్‌కు రూ.లక్ష కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో ఏర్పాటు చేసిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని మాట్లాడారు.అంతకుముందు చంద్రబాబు వేదికపై ఏర్పాటు చేసిన స్టేజ్‌పై నడిచి ప్రజలకు అభివాదం చేశారు. స్టేజ్‌పై సీఎం వెంట మంత్రులు సత్యకుమార్, మనోహర్ ఉన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తున్నామని చెప్పారు. ఇవాళ 26,401 మందికి పట్టాలు ఇస్తున్నట్లు వివరించారు. ఇటీవల విశాఖలో, మంగళగిరిలో - మిగతా 2 లో




తొలివార్త

గురువారం 01 - 10 - 2026

# సంపాదకీయం

## అలసత్వంపై కొరడా



నలుగురు గుమిగూడి నిరసనకు దిగితే అతిగా స్పందించటం అలవాటైన ఢిల్లీ పోలీసులకు ఇటీవల అక్కడ వరసగా చోటుచేసుకున్న లైంగిక నేరాల గురించి పట్టింపు లేనట్టు కనబడుతోంది. మొన్న ఆగస్టులో గ్రేటర్ నోయిడా నుంచి కశ్మీరీ గేటువరకూ 47 కిలోమీటర్ల దూరం ప్రయాణించిన బస్సులో ఒక మైనర్ బాలికపై దుండగులు అత్యాచారానికి ఒడిగట్టారు. వారంరోజుల క్రితం ఆగ్నేయ ఢిల్లీలోని ఆస్తా కుంజ్ పార్క్ దగ్గర మరో మైనర్ బాలికపై ముగ్గురు లైంగిక నేరానికి పాల్పడి హత్యచేశారు. దానికి సమీపంలోని లేడీ శ్రీరాం కాలేజీ విద్యార్థినులైతే తమకు లైంగిక వేధింపులు నిత్యకృత్యమయ్యాయనీ, ఫిర్యాదులు చేసినా ఫలితం ఉండటం లేదనీ చెబుతున్నారు. ఢిల్లీ--ఎన్‌సీఆర్ పరిధిలో ఈనెల మొదటివారం మొదలుకొని ఇప్పటివరకూ డజను వరకూ లైంగిక నేరాలు వెలుగులోకొచ్చాయని మీడియా కథనాలు చెబుతున్నాయి.అందుకే సోమవారం సర్వోన్నత న్యాయస్థానం పోలీసులపైనా, అధికార యంత్రాంగంపైనా ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇవన్నీ 2012 నాటి నిర్భయ ఉదంతాన్ని గుర్తుకు తెస్తున్నాయని వ్యాఖ్యానించటంతోపాటు శాంతిభద్రతల్ని మెరుగుపరచడానికి నాలుగు సూచనలు చేసింది. వీటిని వచ్చేనెల 5 లోగా అమల్లోకి తీసుకురావాలని ఆదేశించింది. డీఎస్‌పీ ర్యాంకుకు తక్కువకాని అధికారులతో జిల్లాలవారీగా ఎక్కడెక్కడ ప్రమాదకర ప్రాంతాలున్నాయో గుర్తించాలన్నది అందులో మొదటి సూచన. అక్కడి పార్కులు, విద్యాసంస్థలు, శివారు ప్రాంతాలు వగైరాలను ఇందుకోసం కూలంకషంగా పరిశీలించాలని తెలిపింది. అలాగే ఇలాంటి ప్రాంతాల్లో రోజంతా గస్తీ ఉండేలా చూడాలని కోరింది. నిఘా కెమెరాల పనితీరు ఎలావుందో తరచు తనిఖీలుచేసి, అవసరమైన మరమ్మత్తులు చేయించాలని, చీకటి ప్రాంతాలు ఎక్కడా ఉండటానికి వీల్లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించింది. వాహనాల కిటికీలకు నల్లటి తెరలు, ఫిల్ములు లేకుండా చూడాలని ఆదేశించింది.నిజానికి వీటిల్లో కొన్ని నిర్భయ ఉదంతం తర్వాత ఏర్పాటైన జస్టిస్ జేఎస్ వర్మ కమిషన్ సిఫార్సుల్లో కూడా ఉన్నాయి. 2012లో నిర్భయ ఉదంతం తర్వాత దేశ వ్యాప్తంగా పెల్లుబికిన నిరసనలతో యూపీఏ ఆధ్వర్యంలోని కేంద్రం వెంటనే స్పందించి ఈ కమిషన్ ఏర్పాటుచేసింది. అది నివేదిక ఇవ్వడానికిముందే ఉరిశిక్షతోసహా కఠిన శిక్షలకు ఆస్కారం కల్పించే నిర్భయ ఆర్డినెన్స్ కూడా తెచ్చింది. అప్పట్లోనే ఆ ఆర్డినెన్స్ పైనా, దాని స్థానంలో వచ్చిన చట్టంపైనా మానవహక్కుల సంఘాలు, మహిళా సంఘాలూ పెదవి విరిచాయి. కేవలం కఠిన శిక్షలు నిర్దేశించినంత మాత్రాన నేరాలు ఆగబోవనీ, వెంటవెంటనే స్పందించే యంత్రాంగం, పకడ్బందీ దర్యాప్తు, న్యాయ స్థానాల్లో వేగంగా విచారణ, శిక్షలు ఉంటేనే నేరం చేయాలంటే భయపడే పరిస్థితులుంటాయనీ ఆ సంఘాలు తెలిపాయి. ఇటీవల ఐపీసీ బదులుగా తీసుకొచ్చిన భారతీయ న్యాయసంహితలో అత్యాచార నేరానికి విధించే శిక్షను ఏడేళ్లనుంచి పదేళ్లకు పెంచారు కూడా. దాదాపు పదిహేనేళ్లు గడిచాక చూస్తే పరిస్థితి మొదటికొచ్చింది. కళాశాల విద్యార్థినులు ఫిర్యాదులు చేస్తున్నా పోలీసులకు తీరిక లేకపోయింది. కనీసం ఆ ప్రాంతంలో గస్తీ పెంచాలన్న ఆలోచన కూడా రాలేదు. దాని పర్యవసానంగానే బాలిక బలైపోయింది.మహిళలపై సమాజంలో శతాబ్దాలుగా పేరుకుపోయిన భావనలు, జెండర్ వివక్ష, బాధ్యతాయుత స్థానాల్లో ఉండేవారి వ్యవహారశైలి, ప్రభుత్వాల అలసత్వమూ ఇలాంటి నేరాలను పరోక్షంగా ప్రోత్సహిస్తున్నాయని జస్టిస్ జేఎస్ వర్మ కమిషన్ చేసిన వ్యాఖ్య గమనించదగ్గది. ఉదంతం జరిగినప్పుడల్లా బాధితుల్నే తప్పుబట్టే సంస్కృతి దేశంలో ఇంకా పోలేదు. వాస్తవానికి నిర్భయ ఉదంతం తర్వాత వెనువెంటనే చర్యలుంటాయన్న భరోసాతో ఫిర్యాదులు చేసేవారి సంఖ్య పెరిగింది. కానీ ఎప్పట్లానే అలసత్వమూ, ఫిర్యాదు ఇచ్చినవారినే తప్పుబట్టే ధోరణి గమనించాక చాలామంది వెనక్కి తగ్గటం మొదలైంది. అసలు నమోదైన కేసుల దర్యాప్తులో పోలీసులు నిరాసక్తత సమస్యను మరింత పెంచుతోంది. నిరుడు వెలువడిన గణాంకాల ప్రకారం ఢిల్లీ పరిధిలో రోజుకు అయిదు అత్యాచార కేసులు నమోదవుతున్నాయి. పరిస్థితి మరింత జటిలం కాకముందే పోలీసులు మేల్కొనాలి. సుప్రీంకోర్టు సూచనలను తక్షణమే అమల్లోకి తీసుకురావాలి.

## ‘సర్’పై వివాదం వేళ.. ఎన్నికల సంఘం సంచలన నిర్ణయం

**మొదటిపేజీ తరువాయి -** మార్పు చేసింది. ‘ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ’ (సర్) పూర్తయిన 20 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కొత్త ఓటర్లు ఇక తల్లిదండ్రులు, తాతలు, నానమ్మల ఓటరు జాబితా వివరాలు సమర్పించాల్సిన అవసరం లేదు. ఈ మేరకు ఫారం-6లో మార్పులు చేసింది.ఇప్పటివరకు కొత్త ఓటరు పేరు ఓటర్ల జాబితాలో చేర్చేందుకు సాధారణ ఫారం-6 సరిపోయేది. అయితే ‘సర్’ ప్రక్రియ సమయంలో ఫారం-6తో పాటు అదనపు డిక్లరేషన్ తీసుకున్నారు. గతంలో ఉన్న ఓటర్ల జాబితాతో తమ కుటుంబానికి ఉన్న సంబంధాన్ని నిర్ధారించేందుకు తల్లిదండ్రులు లేదా తాతల వివరాలు ఇవ్వాలని అందులో కోరారు.‘సర్’ పూర్తయిన రాష్ట్రాల్లో ఇప్పుడు ఈ అదనపు డిక్లరేషన్ అవసరం ఉండదు. బిహార్, పశ్చిమ బెంగాల్ సహా 20 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సర్ పూర్తయిందని ఈసీ తెలిపింది. సర్ సమయంలో పేరు జాబితాలో లేని వారు, అలాగే కొత్తగా ఓటు హక్కు పొందిన యువత, తొలిసారి ఓటు వేయబోయే వారు నిరంతర అప్‌డేషన్ ప్రక్రియలో పేర్లు నమోదు చేసుకోవచ్చు.అయితే ‘సర్’ ఇంకా కొనసాగుతున్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మాత్రం ఈ నిబంధన కొనసాగుతుంది. అక్కడ కొత్త ఓటర్లు ఫారం-6తో పాటు ‘సర్’కు సంబంధించిన డిక్లరేషన్ సమర్పించాల్సి ఉంటుంది. గత ఓటర్ల జాబితాతో తమ సంబంధాన్ని చూపించే వివరాలను కూడా ఇవ్వాలి.ఫారం-6లో మార్పులపై ఈసీలో విభేదాలు ఉన్నట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అదనపు డిక్లరేషన్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఫారం-6, ‘సర్’కు సంబంధించిన నిర్ణయాలు ముగ్గురు కమిషనర్ల ఏకగ్రీవ నిర్ణయాలేనని ఈసీ స్పష్టం చేసింది.సెప్టెంబర్ 26న విడుదల చేసిన వివరణలో సర్ డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు సమర్థించిందని ఈసీ పేర్కొంది. సర్ పూర్తయిన ప్రాంతాల్లో, అలాగే ఇంకా ప్రారంభం కాని ప్రాంతాల్లో అదనపు డిక్లరేషన్ అవసరం లేదని తెలిపింది.తాజా మార్పుతో సర్ పూర్తయిన రాష్ట్రాల్లో కొత్త ఓటర్లు ఇక సాధారణ ఫారం-6 ద్వారానే నమోదు చేసుకోవచ్చు. అదనంగా కుటుంబానికి సంబంధించిన పాత ఓటర్ల జాబితా వివరాలు ఇవ్వాల్సిన అవసరం ఉండదు.

## సమస్యల పరిష్కారానికి కేంద్రం వద్దకు ఎన్నిసార్లయినా వెళ్తాం

**మొదటిపేజీ తరువాయి -** చేశారు. సమస్యల పట్ల ఉద్యోగులు నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వం సరిగా పని చేయట్లేదంటారని, ప్రజలకు ఎన్ని చట్టాలు చేసినా నిధులు ఇచ్చినా చేరవేయాల్సింది ఉద్యోగులేనని వెల్లడించారు.“అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద రూ.840 కోట్ల కేంద్ర నిధులు సాధించుకున్నాం. కేంద్రం సహకరిస్తే అభినందించడానికి సీఎంగా నాకు శషభిషలు లేవు. ఎన్నికలు వచ్చినప్పుడే మాకు రాజకీయాలు అప్పుడే ప్రత్యర్థులం. మిగతా సమయాల్లో రాష్ట్రం, కేంద్రం సహకరించుకునే ధోరణి ఉండాలి. కేంద్రం, రాష్ట్ర సంబంధాల మెరుగుకు నిరంతరం ప్రయత్నం చేస్తాం. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సహకరించి ప్రాజెక్టులకు అనుమతులు, నిధులు ఇవ్వాలి. వందల కోట్లతో ప్రాజెక్టులు నిర్మించినా కేంద్రం అనుమతులు ఇవ్వకపోతే నిష్ఫలం. సమస్యల పరిష్కారానికి కేంద్రం వద్దకు ఎన్ని సార్లయినా వెళ్లాల్సిందే. ఆరు నెలల్లో 170 ఎకరాల కంటోన్మెంట్ రోడ్‌లో కేంద్రం అనుమతి ఇచ్చింది. బేగంపేట రన్‌వే కింద నుంచి టన్నెల్ ద్వారా రోడ్డు మంజూరు చేశారు. ఏడాదిలోపు ఎలివేటెడ్ కారిడార్ అందుబాటులోకి వస్తుంది.రేవంత్ రెడ్డి పర్యటనలో కేంద్రమంత్రి బండి సంజయ్, మంత్రులు పొన్నం, శ్రీధర్‌బాబు, పొంగులేటి, తుమ్మల, అడ్లూరి లక్ష్మణ్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్?లు హాజరయ్యారు.

## కాంగ్రెస్‌ను నిలదీసిన కవిత

**మొదటిపేజీ తరువాయి -** చేశారు. రెండు ఎమ్మెల్సీ స్థానాలనూ రెడ్డి సామాజిక వర్గానికే కేటాయించడం పూర్తి సామాజిక అన్యాయమని ఆమె ఆరోపించారు.మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి సామ రామ్మోహన్ రెడ్డిని, నల్గొండ-ఖమ్మం-వరంగల్ స్థానానికి రామిరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ప్రకటించింది. ఈ ఇద్దరు అభ్యర్థులు రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారే కావడంతో రాజకీయంగా చర్చనీయాంశమైంది.ఈ నిర్ణయంపై సోషల్ మీడియా వేదికగా కవిత స్పందించారు. “రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ సీట్లు... రెండు చోట్లా రెడ్డి నేతలకే టికెట్లు... ఇది పూర్తి సామాజిక అన్యాయం కాదా?” అని ఆమె ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో బలహీన వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన బాధ్యత అధికార పార్టీపై ఉంటుందని, కేవలం ఒకే వర్గానికి ప్రాధాన్యం ఇవ్వడం తెలంగాణ ఆత్మగౌరవానికి విరుద్ధమని ఆమె పేర్కొన్నారు.

# పేదల సంతోషమే నిజమైన అభివృద్ధి

**మొదటిపేజీ తరువాయి -** ఇళ్లపట్టాలు ఇచ్చామని అన్నారు. మొత్తం 60 వేల మందికి పట్టాలు ఇచ్చామని, దీని విలువ సుమారు రూ.52 వేల కోట్లని వెల్లడించారు. తద్వారా ఒక్కొక్కరికీ సగటున రూ.50 లక్షల నుంచి రూ.కోటి లబ్ధి చేకూర్చామని వివరించారు. “ఇంటిపట్టా అనేది పేద ప్రజల దశాబ్దాల కల. ఇంటిపట్టాల కోసం కొందరు 40, 50 ఏళ్లపాటు ఎదురుచూశారు. గతంలో ఎందరో ప్రయత్నాలు చేసినా పట్టాలు మాత్రం ఇవ్వలేదు.707 ఎకరాల్లో ఉన్న స్థలాలకు ఇంటి పట్టాలిస్తున్నాం. వారసత్వంగా వస్తున్న మీ ఇంటిని అమ్ముకోవద్దు. సొంతింట్లో, భద్రంగా ఉండాలనేది ప్రతి పేదవాడి చిరకాల కోరిక. ఇంటిపట్టాల విషయంలో 120 ఏళ్ల సమస్యకు పరిష్కారం చూపాం. ఇవాళ పేదల ఆత్మగౌరవానికి పట్టాభిషేకం జరుగుతోంది. పేదవాళ్లు ఆనందంగా ఉండటమే నిజమైన అభివృద్ధి.అభ్యంతరం లేని ప్రతిచోటా పేదలకు ఇళ్లపట్టాలు ఇస్తున్నాం. పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం స్వర్ణాంధ్ర సాధనకు తొలి మెట్టు. పేదలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే మూడు పార్టీలు కలిశాం. గత ప్రభుత్వ పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నాం. ప్రతి ఒక్కరికీ న్యాయం చేసే బాధ్యత కూటమి ప్రభుత్వానిది.కొందరు నేతలు మీ భవిష్యత్‌తో ఆటలు ఆడుకున్నారు. గత సర్కార్ భూ సర్వే పేరుతో ప్రతి ఊరిలో వివాదాలు సృష్టించింది. మీ ఆస్తులపై, మీ పాస్‌బుక్‌లపై వారి బొమ్మలు వేసుకున్నారు. మేం మాత్రం ప్రభుత్వ రాజముద్రతో పట్టాలు ఇస్తున్నాం. గొడ్డలి పార్టీ ఇంటిపట్టాలు ఇవ్వవద్దని అంటోంది. నేను ఏ పార్టీకీ భయపడను. ఇంటిపట్టాలు ఇస్తూనే ఉంటాం. వైఎస్సార్సీపీ పాలనకు, కూటమి ప్రభుత్వ పాలనకు తేడా గమనించాలని’ చంద్రబాబు పేర్కొన్నారు. పట్టిసీమ కట్టకుండా వైఎస్సార్సీపీ నేతలు అడ్డుపడ్డారని చంద్రబాబు విమర్శించారు. ఎవరు అడ్డుపడినా, ఎన్ని ఇబ్బందులు పెట్టినా పట్టిసీమ పూర్తి చేశామన్నారు. పట్టిసీమతో 50 టీఎంసీల నీరు కృష్ణా డెల్టా, విజయవాడకు ఇచ్చామని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా 75 టీఎంసీల నీరు సముద్రంలోకి పోతున్నాయని తెలిపారు. వచ్చే మార్చి నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని స్పష్టం చేశారు. పోలవరం కుడికాలువ ద్వారా త్వరలోనే నీళ్లు ఇస్తామని అన్నారు. మనం బాగుండాలి, పొరుగువాళ్లు కూడా బాగుండాలని కోరుకుం టామని చెప్పారు. గోదావరి-కావేరి అనుసంధానం జరిగితే దక్షిణాదిలో నీటికి కొరతే ఉండదని చంద్రబాబు వెల్లడించారు. ‘వైకుంఠపురం, చోడవరం బ్యారేజ్‌లు వస్తాయి. ఈ బ్యారేజ్‌లు పూర్తయితే విజయవాడకు తాగునీటి ఇబ్బందే ఉండదు. రైల్వే బ్రిడ్జి, ప్రకాశం బ్యారేజ్ మధ్య మరో వంతెన వస్తుంది. ఒక్క కియా ప్రాజెక్టు అనంతపురం జిల్లాలో అనేక మార్పులు తెచ్చింది. వెలిగొండ ప్రాజెక్టు మార్కాపురం జిల్లాలో మార్పులు తెస్తోంది. అల్లూరి ఎయిర్‌పోర్ట్ విజయనగరం జిల్లా అభివృద్ధికి తోడ్పడుతోంది. అనేక కష్టాలు అధిగమించి వికాసం వైపు అడుగులు వేస్తున్నాం. వచ్చే పాతికేళ్లలో మనం వేసే ప్రతి అడుగూ చాలా కీలకం. స్వర్ణాంధ్ర సాధనలో మాకు ప్రజల మద్దతు కావాలి. ప్రజల జీవితాల్లో వెలుగులు తెచ్చేందుకు కష్టపడతాం. మా ప్రభుత్వ కార్యక్రమాలు చూడాలని, అండగా నిలవాలని’ చంద్రబాబు కోరారు.“ప్రతి లబ్ధిదారుడికీ ఒకటో తేదీనే పింఛన్ ఇస్తున్నాం. స్త్రీశక్తి కింద మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. మా మహిళల కోసం భవిష్యత్‌లో ఏసీ బస్సులే కొంటాం. గత సర్కార్ కరెంట్ ఛార్జీలు పెంచి, పేదలపై భారం వేసింది. మేం వచ్చాక మూడేళ్లుగా కరెంట్ ఛార్జీలు పెంచలేదు. అన్న క్యాంటీన్ ద్వారా రూ.5కే పేదవాడికి భోజనం పెడుతున్నాం. పేదవాడు ఆకలితో ఉండకూడదనేదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. ప్రజల ఖర్చులు తగ్గాలి, ఆదాయం పెరగాలి. పీ-4 విధానం తెచ్చాం, పేదలను దత్తత తీసుకునేలా చేశాం.అమరావతికి ఘనమైన చరిత్ర ఉందని చంద్రబాబు వివరించారు. ఇందుకోసం రైతులు భూములు త్యాగం చేశారని గుర్తుచేశారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఎన్నో రకాలుగా అమరావతిని అడ్డుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘అమరావతి అన్నారు, విశాఖ అన్నారు, ఇప్పుడు మావిగన్ అంటున్నారని’ మండి పడ్డారు. ఎవరెన్ని కుట్రలు చేసిన రాజధాని అభివృద్ధిని అడ్డుకోలేరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు, తదితరులు పాల్గొన్నారు.

## రైతుబజార్లలో రూ.35కే కిలో ఉల్లి

**మొదటిపేజీ తరువాయి -** సూచనల మేరకు ధరల స్థిరీకరణ చర్యలు చేపట్టారు. ఉల్లిపాయలు కొనుగోలు చేసేందుకు వచ్చే వారు తమ ఆధార్ కార్డు లేదా రేషన్ కార్డును తప్పనిసరిగా చూపించాల్సి ఉంటుంది. దీని ఆధారంగా ప్రతి కుటుంబానికి నెలకు 2 కిలోల చొప్పున సబ్సిడీ ఉల్లిని అందిస్తారు. తొలి దశలో రాష్ట్రవ్యాప్తంగా 130 రైతుబజార్లలో ఈ విక్రయాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. త్వరలోనే మొబైల్ వాహనాలను ఏర్పాటు చేసి, ప్రజలకు మరింత చేరువగా రాయితీ ఉల్లిపాయలను పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.ఎల్‌నినో ప్రభావం, ఇరాన్ యుద్ధ పరిణామాల కారణంగా నిత్యావసరాల ధరలు అమాంతం పెరిగాయని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ విపత్కర పరిస్థితుల్లో సామాన్యులపై భారం పడకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటోందన్నారు. ఇప్పటికే మార్కెట్లో బియ్యం ధరలు పెరిగిన నేపథ్యంలో, తక్కువ ధరకే మేలు రకం బియ్యాన్ని అందిస్తున్నామని గుర్తుచేశారు. దీనికి కొనసాగింపుగా త్వరలో 1.20 లక్షల మెట్రిక్ టన్నుల కందిపప్పుతో పాటు, పామాయిల్‌ను సామాన్యులకు రాయితీపై అందించనున్నట్లు వెల్లడించారు. రేషన్ దుకాణాలు, మినీ మార్ట్‌ల ద్వారా గోధుమపిండి, పంచదార పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ కన్నబాబు, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో కమ్మ, క్రైస్తవ సామాజికవర్గాలదే అధికారం

**మొదటిపేజీ తరువాయి -** పరిమితమైందని, ఈ రెండు కుటుంబ పార్టీలకు ప్రత్యామ్నాయం అవసరమని మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... టీడీపీ, వైసీపీలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్ర విభజన హామీలు నెరవేరకపోయినా ఈ రెండు పార్టీలు కేంద్రాన్ని ప్రశ్నించవని, కేవలం పదవుల కోసమే పనిచేస్తాయని ఆరోపించారు.చంద్రబాబు తన కుమారుడిని ముఖ్యమంత్రిని చేయడానికి, జగన్ తన కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి తీసుకురావడానికే ప్రాధాన్యత ఇస్తారని సాయిరెడ్డి విమర్శించారు. గత 12 ఏళ్లలో రాష్ట్రానికి రూ.12 లక్షల కోట్ల అప్పు తప్ప ఒక్క కొత్త ప్రాజెక్టు గానీ, యువతకు ఉద్యోగాలు గానీ రాలేదని అన్నారు. ఒక పార్టీకి కుల పిచ్చి, మరో పార్టీకి మత పిచ్చి పట్టుకుందని దుయ్యబట్టారు. తాను పెట్టబోయే కొత్త పార్టీ అధికారంలోకి వచ్చినా తాను సీఎం కాబోనని, అన్ని కులాలకు సమాన అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు.రాజధాని మార్పు అవివేకమని, అమరావతిని అన్ని కులాలు, మతాల రాజధానిగా అభివృద్ధి చేయాలని తాను కోరుకుంటున్నానని స్పష్టం చేశారు. విశాఖను రాజధాని చేస్తామని చెప్పి మాట తప్పిన వైసీపీ... ఉత్తరాంధ్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ‘మావిగన్’ అంటూ జగన్ ఇప్పుడు యూటర్న్ తీసుకోవడాన్ని ఆయన తప్పుబట్టారు.లిక్కర్ స్కామ్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని, రాజ్ కెశిరెడ్డి వల్లే ఆ వ్యవహారం జరిగిందని విజయసాయి రెడ్డి తెలిపారు. సజ్జల రామకృష్ణారెడ్డి తనను జగన్ వద్ద విలన్‌గా చిత్రీకరించి పార్టీకి నష్టం చేస్తున్నారని ఆరోపించారు. పార్టీ అధికారంలోకి వచ్చాక కుట్రలతో తనను పక్కన పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే కొత్త పార్టీ పేరును ప్రకటించి, ఆ తర్వాత పాదయాత్ర చేపడతానని ఆయన వెల్లడించారు.

## అక్టోబర్2 నుంచి ‘సేవ్ డెమోక్రసీ’ యాత్ర

**మొదటిపేజీ తరువాయి -** వరకు ర్యాలీగా చేపట్టనున్నారు. అక్టోబర్ రెండో వారంలో ప్రతిపక్ష నేతలంతా రాష్ట్రపతిని కలిసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వినతిపత్రం సమర్పించనున్నారు. దేశవ్యాప్తంగా 5 భారీ ర్యాలీలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. వాటి తేదీలు, ప్రదేశాలు త్వరలో ప్రకటిస్తామన్నారు. గతంలో నోట్ బందీ చేసిన ప్రధాని మోదీ, ఇప్పుడు ‘ఓట్ బందీ’ ద్వారా ప్రజల ఓటు హక్కును కాలరాస్తున్నారని ఆరోపించారు. ప్రధాని, హోంమంత్రి ఈ ఓట్ల దొంగతనం వెనుక ఉండి ఎన్నికల సంఘాన్ని పావుగా వాడుకుంటున్నారని ఖర్గే ఆరోపించారు. భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ ఈవీఎంలకు స్వస్తి పలికి బ్యాలెట్ పేపర్లను వాడాలని డిమాండ్ చేశారు. అలాగే ముందున్న ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. సంస్థలను బలహీనపరుస్తున్నారని, ఎన్నికల సంఘం ప్రభుత్వ ప్రభావానికి లోనవుతోందని ఖర్గే ఆరోపించారు. అక్రమ మార్గాల ద్వారా ఎన్నికల్లో గెలుస్తున్నారని, ప్రతిపక్ష పార్టీల ప్రజాస్వామ్య పనితీరుకు ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపించారు.ఈ కీలక సమావేశానికి కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో పాటు టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ, జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, ఎన్సీపీ-ఎస్పీ ఎంపీ సుప్రియా సూలే హాజరయ్యారు. శివసేన-యూబీటీ చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ తదితరులు ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఇండియా కూటమి నేతలు సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్య నిర్మాణంపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేష్ కుమార్‌లు దాడి చేశారని అన్ని పార్టీలు భావిస్తున్నట్లు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసిన వారికి శిక్షపడేలా చూస్తామని ఆయన హెచ్చరించారు.మరోవైపు ఈ పరిణామాలను అత్యంత కుంభకోణంతో కూడుకున్న విషయంగా మమతా బెనర్జీ అభివర్ణించారు. జజుజ జ్ఞానేశ్‌కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆయన్ను తొలగించకపోతే ఆందోళనలు ప్రతి మూలకూ విస్తరిస్తామని దీదీ హెచ్చరించారు. ప్రధాని మోదీ సైతం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.మరోవైపు లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సైతం సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల ఫలితాలను తారుమారు చేయడానికి ప్రధాని నరేంద్ర మోదీ ఆయనను వాడుకుంటున్నారని ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్? వేదికగా మండిపడ్డారు. దేశంలో జీవితకాల సంపూర్ణ చట్టపరమైన రక్షణను అనుభవిస్తున్న ఏకైక పౌరుడు జ్ఞానేష్ కుమార్ అని కాంగ్రెస్ నాయకుడు ఆరోపించారు.

## ఆసియా క్రీడల్లో ఆర్చర్ చికితకు ఒకేరోజు రెండు స్వర్ణాలు

**మొదటిపేజీ తరువాయి -** అభినందనలు తెలిపారు.పెద్దపల్లి జిల్లాకు చెందిన చికిత.. ఆసియా క్రీడల్లో కాంపౌండ్ ఉమెన్స్ టీమ్, మిక్స్‌డ్ టీమ్ విభాగాల్లో స్వర్ణ పతకాలను కైవసం చేసుకుంది. ముఖ్యంగా, మిక్స్‌డ్ టీమ్‌లో తన భాగస్వామి సాహిల్ జాదవ్‌తో కలిసి సాధించిన ఈ విజయంతో ఆమె 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడం విశేషం. ఈ విజయం తెలంగాణ క్రీడా రంగంలో నూతనోత్సాహాన్ని నింపింది.

# పేరు మార్చినంత మాత్రాన సిద్ధాంతం, నాయకత్వం మారదు

**మొదటిపేజీ తరువాయి -** స్పష్టం చేశారు. “నా పేరు షారుఖ్ ఖాన్ అని పెట్టుకుంటే నేను షారుఖ్ ఖాన్ అయిపోతానా?” అని ఆయన ప్రశ్నించారు. ఇండియా టుడే కాన్‌క్లేవ్‌లో మాట్లాడిన ఆయన, పార్టీ పేరు మార్పుపై వివరణ ఇచ్చారు.తెలుగు సినిమాలు పాన్-ఇండియా స్థాయిలో విజయం సాధిస్తున్నప్పుడు, తెలుగు గడ్డపై పుట్టిన రాజకీయ పార్టీ కూడా జాతీయ స్థాయిలో ఎందుకు విస్తరించకూడదని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించాలనే ఉద్దేశంతోనే పార్టీ పేరు మార్చామని తెలిపారు. రెండేళ్లలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని, కాంగ్రెస్ పాలనపై ప్రజలు పూర్తిగా విసిగిపోయారని ఆయన జోస్యం చెప్పారు. తదుపరి సీఎం కేసీఆరేనని, తాను కాదని ప్రజలు కోరుకుంటున్నారని



స్పష్టం చేశారు.ఈ సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్‌లపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. మత ప్రాతిపదికన దేశాన్ని విభజించేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రజలు పూజించే రాముడు, శివుడి మధ్య తేడాలు సృష్టించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఉద్యోగాల కల్పన, ఎన్నికల హామీల అమలు వంటి ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించడమే ఈ రెండు జాతీయ పార్టీల విధానమని విమర్శించారు.ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం విశ్వసనీయతపై తీవ్రమైన సందేహాలు తలెత్తుతున్నాయని కేటీఆర్ అన్నారు. ఈసీ పనితీరుపై ఇటీవల ఓ జాతీయ మీడియా చేసిన పరిశోధనలో వెల్లడైన అంశాలు నిజమేనని చాలామంది నమ్ముతున్నారని, దీనిపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర ప్రజా వ్యతిరేకత ఉందని, అయితే ప్రధాన ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ యువతతో కలిసి నడవడంలో విఫలమయ్యారని విమర్శించారు.

# హైదరాబాద్‌లో ప్రతి 100 మందికి 70 వాహనాలు

**మొదటిపేజీ తరువాయి -** చేశారు. నగరంలో నాణ్యమైన ప్రజా రవాణా వ్యవస్థ అందుబాటులో లేకపోవడమే ఈ సమస్యకు మూల కారణమని ఆయన స్పష్టం చేశారు. గత్యంతరం లేని పరిస్థితుల్లోనే నగరవాసులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని, ఇది ఆందోళన కలిగించే విషయమని అన్నారు. ఓ యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ప్రపంచంలోని అనేక సంపన్న నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లోనే ప్రైవేట్ వాహనాల సాంద్రత ఎక్కువగా ఉందని జేపీ గణాంకాలతో సహా వివరించారు. “సింగపూర్‌లో ప్రతి 100 మందికి 11, షాంఘైలో 17, లండన్, న్యూయార్క్‌లలో 24 నుంచి 26 ప్రైవేట్ వాహనాలు మాత్రమే ఉన్నాయి. కానీ హైదరాబాద్‌లో ప్రతి 100 మందికి ఏకంగా 70 వాహనాలు ఉన్నాయి. లండన్, న్యూయార్క్ కంటే హైదరాబాద్ నగరం గొప్పదా? మరి ఎందుకిన్ని వాహనాలు? గతిలేక కొంటున్నారు” అని ఆయన వ్యాఖ్యానించారు.ప్రజా రవాణా వ్యవస్థలోని లోపాలే ఈ దుస్థితికి కారణమని జేపీ విశ్లేషించారు. మెట్రో, బస్సులు సమయానికి అందుబాటులో లేకపోవడం, ఇంటి నుంచి స్టేషన్‌కు, స్టేషన్ నుంచి గమ్యస్థానానికి చేరుకోవడానికి సరైన ‘ఫస్ట్ అండ్ లాస్ట్ మైల్ కనెక్టివిటీ’ లేకపోవడం ప్రధాన సమస్యగా మారిందన్నారు. ప్రయాణ దూరంలో ఇది 20% మాత్రమే ఉన్నప్పటికీ, సమయం 40%, ఖర్చు 60% ఇందుకే అవుతోందని ఆయన వివరించారు. “ఈ గొడవంతా ఎందుకులే అని చాలామంది సొంత కారు లేదా స్కూటర్‌లో వెళ్తున్నారు. అందుకే ట్రాఫిక్, కాలుష్యం రెండూ పెరుగుతున్నాయి” అని జేపీ పేర్కొన్నారు.హైదరాబాద్‌లో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రధాన రహదారులపై వాహనాలు కిక్కిరిసిపోవడం, సిగ్నళ్ల వద్ద నిరీక్షణ, ప్రయాణ సమయం పెరగడం



వంటి సమస్యలతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో మెట్రో, ఆర్టీసీ సేవలను విస్తరించి, ముఖ్యంగా ఫస్ట్ అండ్ లాస్ట్ మైల్ కనెక్టివిటీని మెరుగుపరచడం ద్వారానే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జయప్రకాశ్ నారాయణ అభిప్రాయపడ్డారు.

# శంషాబాద్‌లో విమానానికి తప్పిన పెను ప్రమాదం



శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో బుధవారం తృటిలో పెను ప్రమాదం తప్పింది. విజయవాడకు బయలుదేరిన ఓ విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో, టేకాఫ్ అయిన కొద్దిసేపటికే పైలట్ దానిని అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ఈ హఠాత్పరిణామంతో విమానంలోని ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే.. 591 ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం 45 మంది ప్రయాణికులతో శంషాబాద్ నుంచి విజయవాడకు బయలు దేరింది. విమానం గగనతలానికి ఎగిరిన కొద్దిసేపటికే సాంకేతిక సమస్య తలెత్తినట్లు పైలట్ గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన ఆయన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) అధికారులకు సమాచారం అందించారు. వారి అనుమతితో విమానాన్ని తిరిగి శంషాబాద్ విమానాశ్రయానికి మళ్లించి సురక్షితంగా ల్యాండ్ చేశారు.విమానం క్షేమంగా ల్యాండ్ అవ్వడంతో అటు ప్రయాణికులు, ఇటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రయాణికులందరూ సురక్షితంగా ఉన్నారని, ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదని విమానాశ్రయ వర్గాలు ధ్రువీకరించాయి. అనంతరం సాంకేతిక బృందం విమానాన్ని తనిఖీ చేసి మరమ్మతులు ప్రారంభించింది. ప్రయాణికులను ప్రత్యామ్నాయ విమానంలో విజయవాడకు పంపేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎయిర్‌లైన్స్ యాజమాన్యం వెల్లడించింది.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

**హిందూ దేవుళ్ళ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన రేవంత్ రెడ్డి**

**బిజెపి నాయకులు**





చౌటుప్పల్, **సెప్టెంబర్ 30 ( తొలివార్త ):** తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఇటీవల హిందువుల ఆరాధ్య దైవలైన శ్రీరాముడు,పరమశివుడి గురించి చేసిన వ్యాఖ్యలకు నిరసిస్తూ చౌటుప్పల్ మున్సిపల్ మరియు మండల భారతీయ జనతా పార్టీ నాయకులు,కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ శ్రీరాముడిని ధనికులకు,శివుడిని పేదలకు,ప్రతీకగా పేర్కొంటూ చేసిన వాక్యాలు హిందూ సమాజం మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు.ఈ వ్యాఖ్యలపై బిజెపి నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.అలాగే భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై కూడా నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ప్రజల విశ్వాసాలను దేశ ప్రధానిని గౌరవించే విధంగా ప్రజాప్రతినిధులు బాధ్యతయుతమైన భాషను ఉపయోగించాలని కోరారు.ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు మాట్లాడుతూ హిందూ దేవతలను రాజకీయాలకు ఉపయోగించకుండా అన్ని మతాల దేవతలను సమానంగా గౌరవించాలని డిమాండ్ చేశారు.శ్రీరాముడు,శివుడు కోట్లాదిమంది హిందువుల ఆరాధ్య దైవాలని వారి గురించి విభజనకు దారి తీసే విధంగా వాక్యాలు చేయడం సరికాదని అన్నారు.హిందూ దేవతలను అవమానించే వ్యాఖ్యలు సహించం-రాముడైనా శివుడైనా మా ఆరాధ్య దైవాలే నన్నారు.ఈ నేపథ్యంలో వలిగొండ క్రాస్ రోడ్ దగ్గర బిజెపి నాయకులు,కార్యకర్తలు గుమ్మడికాయకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రతిరూపాన్ని ఏర్పాటు చేసి పగలగొట్టారు.అదేవిధంగా ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దూడల భిక్షం గౌడ్,మున్సిపల్ అధ్యక్షులు కడారి కల్పన ఐలయ్య యాదవ్,రూరల్ అధ్యక్షులు కైరంకొండ అశోక్,సీనియర్ నాయకులు రమణగోని శంకరయ్య,ఓబిసి జిల్లా ప్రధాన కార్యదర్శి చినుకుని మల్లేశం,మున్సిపల్ కౌన్సిలర్లు బుడ్డ సురేష్,పోలపల్లి లక్ష్మీ ముత్తయ్య,సర్పంచులు తంగళ్ళ వెంకటేశం,నందగిరి వెంకటేశం గౌడ్,కంచర్ల గోవర్ధన్ రెడ్డి,బత్తుల జంగయ్య గౌడ్,కాయతి రమేష్ గౌడ్,దిండు భాస్కర్,కట్ట కృష్ణ,ఉడుగు వెంకటేశం గౌడ్,బాతరాజు ధనుంజయ,ఆనగంటి విష్ణుకాంత్,అమృతం దశరథ,బడుగు కృష్ణ,యాస అశోక్ రెడ్డి,పబ్బతి శేఖర్,లగ్గొని పాండు,కానుగు కొండల్,తేలుకుంట్ల శ్రీధర్,బూత్ అధ్యక్షులు,కార్యదర్శులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేకాట స్థావరాలపై పోలీసుల ఉక్కుపాదం

**భువనగిరి, బీబీనగర్‌లో ముమ్మర దాడులు మొత్తం 34 మంది జూదరుల అరెస్ట్.. రూ.3.93 లక్షల నగదు స్వాధీనం**



**యాదాద్రి భువనగిరి జిల్లా, సెప్టెంబర్ 30 ( తొలివార్త ):**యాదాద్రి భువనగిరి జిల్లాలో గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతున్న పేకాట స్థావరాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. భువనగిరి రూరల్ పోలీసులు, స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ) బృందాలు మంగళవారం వేర్వేరు ప్రాంతాల్లో ఆకస్మిక దాడులు నిర్వహించి మొత్తం 34 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. భువనగిరి మండలం వడాయిగూడెం శివారులోని త్రిశూల్ లాడ్జిపై భువనగిరి రూరల్ పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న 17 మందిని పట్టుకున్నారు. మరో ముగ్గురు వ్యక్తులు పోలీసుల దాడిని గమనించి పరారైనట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 39,970 నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలు, ఒక మారుతి ఓమ్ని వ్యాన్, 12 సెల్‌ఫోన్లు, ఐదు సెట్ల పేకాట కార్డులను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా బీబీనగర్ మండలం అన్నంపట్ల గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఎస్ఓటీ పోలీసులు మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 17 మందిని అదుపులోకి తీసుకోగా, ప్రధాన నిర్వాహకుడితో పాటు మరో నలుగురు వ్యక్తులు పరారైనట్లు పోలీసులు వెల్లడించారు. ఈ స్థావరం నుంచి రూ. 3,53,740 నగదు, 19 మొబైల్ ఫోన్లు, మూడు కార్లు, రెండు బైకులు, పది సెట్ల పేకాట కార్డులు, రెండు పట్టాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో హైదరాబాద్‌లోని ఉప్పల్, గచ్చిబౌలి, నాగోల్, మేడిపల్లి, సికింద్రాబాద్, శంషాబాద్, బోరబండ ప్రాంతాలతో పాటు నల్లగొండ, మిర్యాలగూడ తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు, రియల్టర్లు, ఉద్యోగులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వేర్వేరు ప్రాంతాలకు చెందిన వ్యక్తులను ఒకేచోటకు చేర్చి పెద్ద ఎత్తున పందాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ వ్యవహారంపై పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. స్వాధీనం చేసుకున్న నగదు, వాహనాలు, నిందితులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం బీబీనగర్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. లాడ్జీల ముసుగులో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే నిర్వాహకులపైనా కఠిన చర్యలు తీసుకుంటామని భువనగిరి రూరల్ ఎస్‌హెచ్ఓ అనిల్ కుమార్ హెచ్చరించారు.

# తెలంగాణ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీలకు ఎంపికైన ఊదరి రాధే శ్యామ్



**చౌటుప్పల్, సెప్టెంబర్ 30 ( తొలివార్త ):** యాదాద్రి భువనగిరి జిల్లా,చౌటుప్పల్‌లోని ట్రినిటీ హైస్కూల్ ప్రాంగణంలో ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ఐ(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) అండర్-17మల్కంబ్ ఎంపిక పోటీలు ఘనంగా నిర్వహించారు.ఈ ఎంపిక పోటీలలో ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన అండర్-17 విభాగాల బాల,బాలికలు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు.క్రీడాకారుల ప్రతిభ,నైపుణ్యం మరియు క్రీడా ప్రదర్శన ఆధారంగా ఎంపికైన క్రీడాకారులు తెలంగాణ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ఐ మల్కంబ్ పోటీలలో ఉమ్మడి నల్గొండ జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు.ఈ పోటీలోచౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి తంగడపల్లి గ్రామానికి చెందిన ఊదరి శ్యామ్ సుందర్-లావణ్య దంపతుల కుమారుడు ఊదరి రాధే శ్యామ్ సెలెక్ట్ అయ్యారు.ఉమ్మడి నల్లగొండ జిల్లా తరఫున రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొననున్నారు.

**విద్య తో పాటు క్రీడల్లో రాణించాలి..**

**ఎంఈఓ గురువరావు**

మల్కంబ్ క్రీడ విద్యార్థుల్లో శారీరక దృఢత్వం,సమతుల్యతఏకాగ్రత,చురుకుదనం మరియు క్రమశిక్షణ పెంపొందించడంలో ఎంతో దోహదపడుతుందని తెలిపారు.పాఠశాల స్థాయి నుంచే ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి,వారికి జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలో అవకాశాలు కల్పించడమే ఈ ఎంపిక పోటీల ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని,మల్కంబ్ వంటి భారతీయ సాంప్రదాయ క్రీడలను ప్రోత్సహించి,వాటి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మండల ఎంఈఓ గురువారావు,పీఈటీఏ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణమూర్తి,ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శి లింగయ్య,జెడ్‌పీహెచ్ఎస్ కోయిలగూడెం పాఠశాల ఉపాధ్యాయులు మట్టయ్య,ట్రినిటీ హైస్కూల్ చైర్మన్ కె.వి.బి. కృష్ణారావు,ట్రినిటీ హైస్కూల్ ప్రిన్సిపాల్ కమ్ డైరెక్టర్ ఉజ్జిని మంజుల,తెలంగాణ మల్కంబ్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.గోపాల్ మరియు వివిధ పాఠశాలల పీఈటీలు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

# ధర్మ జాగరణలో భాగంగా గ్రామ దేవాలయ అర్చక శిక్షణ తరగతులు...

**దేవాలయాల్లో నిత్యపూజలు కొనసాగించడమే ప్రధాన లక్ష్యం**



**అశ్వాపురం సెప్టెంబర్ 30 ( తొలివార్త ):**భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలలోని గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నచిన్న దేవాలయాలు, గ్రామదేవత ఆలయాల్లో నిత్యపూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిరంతరం కొనసాగించే ఉద్దేశంతో గ్రామ దేవాలయ అర్చక పరిషత్ తెలంగాణ -- ఖమ్మం విభాగ్ ఆధ్వర్యంలో ఏన్కూరు మండలంలో నాచారం సిద్ద ఆశ్రమం వేదికగా డా!! నాన్న ప్రేమ్ నిరంతర్ గురూజీ ఆశీస్సులతో ధర్మ జాగరణ గ్రామ దేవాలయ అర్చక శిక్షణ తరగతులలో పాల్గొన్న 10 మంది అశ్వాపురం మండల స్థానికులు పాల్గొనడం విశేషం ఈ శిక్షణ కార్యక్రమం 2026 సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు ఏడు రోజుల పాటు కొనసాగనుంది. గ్రామాల్లో దేవాలయాల నిర్వహణ, నిత్యపూజలు, సంప్రదాయ ఆచారాలను కొనసాగించేదుకు అవసరమైన ప్రాథమిక జ్ఞానం కలిగిన అర్చకులను తయారు చేయడం ఈ శిక్షణ యొక్క ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వాహకులు తెలిపారు. చిన్న దేవాలయాల్లో నిత్యపూజలకు ప్రాధాన్యత తెలంగాణలోని అనేక గ్రామాల్లో గ్రామదేవతలకు సంబంధించిన చిన్న దేవాలయాలు ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో సరైన అర్చకుల కొరత లేదా పూజా విధానాలపై అవగాహన లేకపోవడం వల్ల నిత్యపూజలు క్రమం తప్పుతున్న పరిస్థితి కనిపిస్తోంది.ఈ నేపథ్యంలో గ్రామస్థాయిలోనే అర్చకులను తయారు చేసి, ఆయా దేవాలయాల్లో కనీస నిత్యపూజలు, దీపారాధన, నైవేద్యం, దేవతా ఆరాధన, ఆలయ పరిశుభ్రత, పూజా నియమాలు తదితరాలను సక్రమంగా నిర్వహించేలా శిక్షణ ఇవ్వడం కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా ఉంది. ఇదివరకు వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన అర్చక శిక్షణ కార్యక్రమాల ద్వారా అనేక మంది శిక్షణ పొందారని, వారు తమ గ్రామాల్లో దేవాలయ పూజా కార్యక్రమాలను కొనసాగించడంలో భాగస్వాములయ్యారని నిర్వాహకులు తెలిపారు.

**శిక్షణలో ప్రధానంగా బోధించే అంశాలు**

ఏడు రోజుల శిక్షణలో లఘు పూజా విధానం, నిత్యపూజా క్రమం, సంకల్పం, ఆచమనము, ప్రాథమిక మంత్రోచ్చారణ, దీపారాధన, నైవేద్యం, హారతి, దేవతా ఆరాధనకు సంబంధించిన ప్రాథమిక అంశాలు వంటి విషయాలను ఆచరణాత్మకంగా నేర్పించనున్నారు. అదనంగా హోమ విధానం, గోపూజ, నవగ్రహ పూజ నిర్వహించే విధానాన్ని కూడా శిక్షణలో బోధించనున్నారు. గ్రామదేవాలయాల పవిత్రతను కాపాడటం, ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, పూజా సామగ్రిని సక్రమంగా వినియోగించడం, దేవాలయ సంప్రదాయాలను గౌరవించడం వంటి అంశాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నారు.యోగాతో పాటు ఆధ్యాత్మిక జీవన విధానం,శిక్షణలో భాగంగా యోగాభ్యాసం కూడా నిర్వహించనున్నారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, నియమశీలత, ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకునే విధంగా యోగా మరియు ఇతర ఆధ్యాత్మిక అంశాలను పరిచయం చేయనున్నారు. హిందూ ఆధ్యాత్మిక సంప్రదాయంలో సత్యం, ధర్మం, సేవ, సంస్కారం, నియమం, భక్తి, సమాజ శ్రేయస్సు వంటి విలువలకు ఉన్న ప్రాధాన్యతను శిక్షణార్థులకు వివరించనున్నారు.శిక్షణార్థులకు అర్హతలు శిక్షణలో పాల్గొనే అభ్యర్థులు,కనీసం 5వ తరగతి లేదా ఆపై విద్యాభ్యాసం చేసి ఉండాలి.లఘు పూజ విధానం పుస్తకంలో ముద్రించిన విషయాలను చదవగలిగే సామర్థ్యం ఉండాలి. వయస్సు 18 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండాలి.శిక్షణ మొత్తం ఏడు రోజుల పాటు పూర్తిగా పాల్గొనే సిద్ధత ఉండాలి.గతంలో అర్చక శిక్షణ పూర్తి చేసిన వారికి కూడా ఈసారి శిక్షణలో పాల్గొనే అవకాశం ఉంటుంది.ఏడు రోజుల శిక్షణ తప్పనిసరి శిక్షణార్థులు ఏడు రోజుల శిక్షణలో పూర్తిగా పాల్గొనాల్సి ఉంటుంది. శిక్షణ మధ్యలో వెళ్లేందుకు అనుమతి ఉండదు. పూర్తి ఏడు రోజుల శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన వారికి మాత్రమే ధృవపత్రాలు అందజేయబడతాయి. శిక్షణ కేవలం పుస్తకపరమైన జ్ఞానానికే పరిమితం కాకుండా, పూజా విధానాలను ఆచరణాత్మకంగా నేర్చుకునే విధంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

**గ్రామ దేవాలయాల ద్వారా ధార్మిక, సామాజిక చైతన్యం**

గ్రామ దేవాలయాలు కేవలం పూజా స్థలాలు మాత్రమే కాకుండా, గ్రామ ప్రజలను ఆధ్యాత్మికంగా,సాంస్కృతికంగా అనుసంధానించే కేంద్రాలుగా నిలిచేలా చేయాలన్నది ఈ కార్యక్రమం ఉద్దేశ్యంగా,పేర్కొన్నారు.పండుగలు, జాతరలు, ప్రత్యేక పూజలు, ధార్మిక కార్యక్రమాలను,సంప్రదాయబద్ధంగా నిర్వహించడం, యువతలో,భారతీయ,సంస్కృతి--సంప్రదాయాలపై అవగాహన పెంచడం, పెద్దల నుంచి వచ్చే ఆచారాలను తదుపరి తరాలకు అందించడం వంటి అంశాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వనున్నారు."ప్రతి గ్రామంలో దేవాలయం -- ప్రతి దేవాలయంలో నిత్యపూజ -- ప్రతి కుటుంబంలో ధార్మిక సంస్కారం" అనే భావనతో గ్రామస్థాయిలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని, పెంపొందించేందుకు,ఈ, శిక్షణ, కార్యక్రమం, ఉపయోగపడు తుందని నిర్వాహకులు,తెలిపారు .గ్రామాల్లో అర్చక సేవ చేయాలనే ఆసక్తి, భక్తి, సేవాభావం ఉన్న యువత ముందుకు వచ్చి ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని గ్రామ దేవాలయ అర్చక పరిషత్ తెలంగాణ -- ఖమ్మం విభాగ్ ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి జిల్లా బంజారా పరియోజన జిల్లా బాధ్యులు తేజావత్ నరేష్ నాయక్ అశ్వాపురం మండల ఆదివాసి జేఏసీ అధ్యక్షులు కల్లూరి నరసింహ మరియు చింతల లింగయ్య, బానోత్ మంగీలా, సత్యనారాయణ, ఢిల్లీ. ఏడుకొండలు పాల్గొనడం జరిగింది

# లక్ష్మీపురంలో అసైన్మెంట్ భూములపై రియల్ దందా

**440 సర్వే నంబర్‌పై బడాబాబుల కన్ను...**

**ప్లాట్లుగా మార్చి విక్రయాలకు రంగం సిద్ధం**

**అధికారుల అండతోనే వ్యవహారం నడుస్తోందంటూ స్థానికులు ఆరోపణలు..**

**సమగ్ర విచారణకు డిమాండ్**



**భద్రాద్రి జిల్లా సెప్టెంబర్ 30 ( తొలివార్త ):**బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామంలో అసైన్మెంట్ భూముల వ్యవహారం,తీవ్ర,చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా 440 సర్వే నంబర్‌కు సంబంధించిన అసైన్మెంట్ భూమిపై కొందరు బడాబాబులు కన్నేశారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి.అసైన్మెంట్ భూములను నిబంధనలకు విరుద్ధంగా ఇతరుల పేర్లపైకి మార్చడం, ప్లాట్లుగా విభజించి విక్రయాలకు సిద్ధం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా, అసైన్మెంట్ భూములకు బ్యాంకు రుణాలు ఎలా మంజూరవుతున్నాయి? రెవెన్యూ రికార్డుల్లో మార్పులు ఎలా జరుగుతున్నాయి? పాసుపుస్తకాలు ఎలా జారీ అవుతున్నాయి? అన్న ప్రశ్నలు,స్థానికుల్లో,వ్యక్తమవుతున్నాయి.అసైన్మెంట్ భూముల రక్షణకు బాధ్యత వహించాల్సిన రెవెన్యూ యంత్రాంగమే ఈ వ్యవహారంలో మౌనంగా ఉంటోందని, కొందరు అధికారుల సహకారం లేకుండా ఇంత పెద్ద స్థాయిలో రియల్ ఎస్టేట్ వ్యవహారం సాగడం సాధ్యం కాదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా ధృవీకరణ రావాల్సి ఉంది. సామాన్యులకు ఇంటి స్థలం కోసం కష్టాలు ఎదురవుతుంటే, అసైన్మెంట్ భూములు మాత్రం ప్లాట్లుగా మారి చేతులు మారుతున్నాయన్న ఆరోపణలు నిజమైతే అది ప్రభుత్వ భూముల పరిరక్షణపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తే అంశంగా మారనుంది.440 సర్వే నంబర్ భూమి అసైన్మెంట్‌గా ఎలా కేటాయించబడింది? ప్రస్తుతం రికార్డుల్లో ఎవరి పేర్లలో ఉంది? భూమిపై ఎలాంటి లావాదేవీలు జరిగాయి? పాసుపుస్తకాలు ఎలా జారీ అయ్యాయి? బ్యాంకు రుణాలు ఏ ప్రాతిపదికన, మంజూరయ్యాయి? ప్లాట్లుగా మార్పుకు అనుమతులు ఉన్నాయా? అనే అంశాలపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది.లక్ష్మీపురంలో అసైన్మెంట్ భూముల పేరుతో జరుగుతున్న వ్యవహారంపై సమగ్ర రెవెన్యూ రికార్డుల పరిశీలన, భూముల క్షేత్రస్థాయి తనిఖీ,సంబంధిత,లావాదేవీలపై విచారణ చేపట్టి వాస్తవాలను బయటపెట్టాలని స్థానికులు కోరుతున్నారు.ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటారా? లేక ఫైళ్లలోనే విచారణ ఆగిపోతుందాఅన్నది, ఇప్పుడు,చర్చనీయాంశంగా మారింది.. అధికారులు తక్షణమే స్పందించి 440 సర్వే నంబర్ భూమి అసైన్మెంట్ భూములపై, రెవిన్యూ అధికారులు సర్వేలు నిర్వహించి నిజానిజాలు బయటికి తీయాలని సమగ్ర విచారణ చేపట్టాలని లక్ష్మీపురం స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఎమ్మెల్యే పాయం చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వలేకనే బిఆర్ఎస్ ఆరోపణలు

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి విమర్శ**



**భద్రాద్రి జిల్లా సెప్టెంబర్ 30 ( తొలివార్త ):**అశ్వాపురం మండల పరిధిలోని అమ్మగారి పల్లి గ్రామపంచాయతీలో నీ,ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాదకేశవరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ, తెలంగాణలో కాంగ్రెస్,ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉమ్మడి ఖమ్మం జిల్లా మంత్రులు మరియు పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు రైతులకు, ప్రజలకు,ఉపయోగపడేటటువంటి మంచి పనులు, చేస్తుంటే, ప్రతిపక్ష పార్టీ నాయకులు, జరుగుతున్న అభివృద్ధి పనులను,చూసి ఓర్వలేక,ఆరోపణలు చేస్తున్నారని అన్నారు ప్రతిపక్ష పార్టీ నాయకులు, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి కూడా బిఆర్ఎస్,నాయకులు,ఒప్పుకోవడానికి, కూడా ఇష్టపడడం లేదని గాదె కేశవరెడ్డి, విమర్శించారు. సంస్కారం కావాలి అది లోపిస్తే ఎవరు ఏం చేస్తారు? మారెళ్ళపాడుకు 25 కోట్లు శాంక్షన్ చేపిస్తే పేటెంట్ హక్కు మీద అయినప్పుడు రాజీవ్ సాగర్ కి 2005 డిసెంబర్ 31న శిలాఫలకేసి పనులు ప్రారంభించి పైపులు కూడా సరిపడా తీసుకొచ్చి స్టోర్ పెడితే ఆ పైపుల్ని స్వార్థ ప్రయోజనాల కోసం వేరే ప్రాజెక్టులకు తరలించింది ఎవరు ఇప్పుడు మారళ్లపాడు నీళ్లు పారుతున్నది, ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో, ముఖ్యమంత్రిగా స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో వేసినటువంటి పైప్ లైన్ కూడా ఉన్నదని సంగతి మర్చిపోవద్దు. అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాదకేశవరెడ్డి బిఆర్ఎస్ పార్టీ నాయకులకు గుర్తు చేశారు. గత,పాలకులు ఐదు సంవత్సరాలలో కనీసం ఒక్క తట్టడు మట్టి కూడా తీయకుండా పేటెంట్ మాదే అనటానికి కొంచమైనా, సిగ్గుండాలని ఆయన అన్నారు. వాట్సాప్ లో పది నిమిషాలు ఒక మెసేజ్ పెట్టి లెఫ్ట్ కెనాల్ మా పోరాటం వల్లనే వచ్చింది. మరొక మెసేజ్ పెట్టి రైట్ కెనాల్ భూ సేకరణ చేసి కాలువలు తవ్వడం మైంది అది మేము చేసిన పోరాటం వళ్ళనే అయింది,అని,భజయించుకుంటున్నారు, గాదె కేశవరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎం వాళ్ళు మేము పాదయాత్ర చేయడం వల్లనే ఈ రాజీవ్ సాగర్ ప్రాజెక్టు వచ్చినది అంటున్నారు. ఇంకొక పార్టీ వాళ్ళు మా మనసులో అనుకోవడం వలనే వచ్చినది వాళ్లు అనుకుంటున్నారు. ప్రతిపక్ష పార్టీ వాళ్లు అలా తృప్తి పడటం ఏమి తప్పు కాదు కానీ 2014 నుండి 19 వరకు మ19 వరకు మనం కాంగ్రెస్ లో ఉన్నాం అప్పుడు, ఆనాడు నాయకుడు రేగ కాంతారావు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రారంభించిన, రాజీవ్ సాగర్ ని గత బిఆర్ఎస్ కెసిఆర్ ప్రభుత్వం లో సీతారామ సాగర్ గా పేరు మార్చి డిజైన్లు మార్చి కమిషన్ల కోసం కడుతున్న ప్రాజెక్టులనీ అప్పుడు కాంగ్రెస్ లో ఉన్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, గత కెసిఆర్ ప్రభుత్వ పాలనలో ఆరోపణలు చేయడం జరిగింది.అని గాదె కేశవరెడ్డి, వారికి గుర్తు చేశారు. అదేవిధంగా,కాంగ్రెస్ లో హస్తం గుర్తు పైన గెలిచిన రేగ కాంతారావు 19 సంవత్సరం, నుండి 23 వరకు ఉన్నారు కదా కాలవలు కంప్లీట్ చేశారు కదా మారేళ్లపాడు పక్కనే బ్రిడ్జి కూడా కంప్లీట్ చేశారు. బ్రిడ్జి కట్టక ముందే మారేళ్లపాడు లిఫ్ట్ కు ఫౌండేషన్ ఎందుకు వేయలేదు, అని ఆయన ప్రశ్నించారు. అంతేకాకుండా 120 అడుగుల లోతు వరకు బ్లాక్ స్టోన్ ఉన్నది పక్కన బ్రిడ్జి ఉండగా స్టోన్ ని బాంబులతో బ్లాస్ట్ చేయడం కుదరదు బ్రిడ్జి డామేజ్ అయ్యే ప్రమాదం ఉందని ఆనాడు రేగ కాంతారావు అన్నారని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ, కాలువల లో బ్రేకర్ తో ఒక్కొక్క రాయి తీయడం వల్ల కొంచెం ఆలస్యమైంది అంతే తప్పు, కానీ మీ నాయకుడు ఎలక్షన్ల ముందు కుల భవనాలకు రోడ్లకు ప్రాజెక్టులకు బ్రిడ్జిలకు శాంక్షన్ తెచ్చినట్టుగా చెప్పుకుంటారు అని మీది రాజకీయ స్టంట్,అని ఆయన అన్నారు. మా కాంగ్రెస్ ప్రభుత్వంలో మారెళ్ళ పాడు, ఎత్తిపోతల పథకం తుమ్మలచెరువు ఆయకట్ట స్థానిక రైతుల ప్రయోజనాల కొరకు మొదలుపెట్టింది, పూర్తి చేసింది స్విచ్ ఆన్ చేసి నీళ్లు వదిలింది, మా కాంగ్రెస్ ప్రభుత్వమే మేమే అపర భగీరథుడు పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దృఢ సంకల్పం జిల్లా మంత్రుల చిత్తశుద్ధి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ సహకారం వల్ల సాధ్యమైంది,అని కాంగ్రెస్ పార్టీ నాయకులు గాదె కేశవరెడ్డి, తెలిపారు. ఇది అయిపోయింది ఇక్కడికే ఆగట్లేదు మేము రైట్ కెనాల్ ద్వారా చింతలచెరువు ఎర్ర బొక్కల చెరువు తీగలచెరువు బల్ల కట్టు చెరువు వరకు నీళ్లు తీసుకెళ్లి వాటి ద్వారా అనేక చిన్న చిన్న కుంటలను కూడా నింపుతూ ప్రతి ఎకరాకు నీరందించాలని దృఢ సంకల్పం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కి ఉందని అన్నారు. తుమ్మలచెరువు వెంకటాపురం గ్రామపంచాయతీలోని గ్రామాలకు,బండ్ల వారి గుంపు కోరెంవారిగూడెం మధ్యలో తుమ్మలచెరువుకు లిఫ్ట్ పెట్టి వెంకటాపురం పంచాయతీలో మావుళ్ళవాయి గ్రామాలలోని రైతుల భూముల కూడా, సాగునీరు పంటలకి అందించాలని, మరియు ఇసుక వాగు నుండి గొంది గూడెం కొత్తూరు ఎలకలగూడెం గ్రామాల రైతులకు కూడా సాగునీరు అందించాలని అదేవిధంగా కొండకుంట దగ్గర లిఫ్ట్ పెట్టి ఆమెర్ధ చింతిరాల చింతిరాల కాలనీ సంద్రల బోడు పంచాయతీలకు సాగునీరు అందించాలని ఇంజనీరింగ్ అధికారులను ఎస్టిమేషన్ మరియు మ్యాప్ తయారు చేయమని ఎమ్మెల్యే, పాయం వెంకటేశ్వర్లు, ఆదేశించడం జరిగింది, అని ఆయన అన్నారు. పూర్తి అవగాహనతో స్థానిక నాయకులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, రైతన్నల పట్ల గాని ప్రజాప్రయోజనల దృష్ట్యా ముందుకు వెళ్తుంటే, జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రభుత్వంపై నిందలు పెడుతున్నారని, ఇది సరైన పద్ధతి కాదని ఇకనైనా ప్రభుత్వానికి సహకరించాలని కోరుతూ ఏదో మతి లేని కామెంట్లు పెడుతూ ఇద్దరు నాయకులు, పైశాచిక,ఆనందంపొందుతున్నారు, అని కేశవరెడ్డి అన్నారు. అసలు నాకు అర్థం కాని విషయం ఏంటంటే బిఆర్ఎస్ రాష్ట్ర నాయకత్వం పార్టీ పదవులన్నీ రద్దు చేసింది అయినా సరే మండల అధ్యక్షుడిని అని ఒకరు పెట్టుకుంటుంటే మరొకరికి ఇది గిట్టట్లేదు అనుకుంటా మండల అధ్యక్ష పదవి,కోసం, పోటీపడుతున్నట్టు ఉందని అన్నారు. కానీ మీరు చెబితే కాంగ్రెస్ ప్రభుత్వం లేదా ఎమ్మెల్యే చేసినట్టు కాదు మేము ఎవరి కామెంట్లను ఆరోపణలను పట్టించుకోము రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకెళ్తాం. అభివృద్ధి ధ్యేయంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పనిచేస్తున్నారని సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, విలేకరులతో తెలియజేశారు.

# 70వ ఎస్ .జి .ఎఫ్ . జిల్లా స్థాయి గట్కా టోర్నమెంట్ కమ్ సెలెక్షన్స్

**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సెప్టెంబర్ 30 ( తొలివార్త ): ప్రతి నిధి.** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, కుత్బుల్లాపూర్ డివిజన్ (గణేష్ నగర్ డివిజన్), వెంకటేశ్వర నగర్లోని బచ్‌పన్ స్కూల్‌లో టీవీఆర్ స్కూల్ కరస్పాండెంట్ టి . వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 70వ ఎస్ .జి .ఎఫ్ . జిల్లా స్థాయి గట్కా టోర్నమెంట్--కమ్--సెలెక్షన్స్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని, క్రీడా మైదానాన్ని ప్రారంభించి, క్రీడాకారులను అభినందించడం ఆనందంగా ఉంది. గట్కా కేవలం ఒక క్రీడ మాత్రమే కాకుండా ధైర్యం, ఏకాగ్రత, క్రమశిక్షణ, శారీరక దృఢత్వం మరియు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే సంప్రదాయ మార్షల్ ఆర్ట్ అని పేర్కొంటూ, క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి మరింత కష్టపడి ముందుకు సాగాలని సూచించాను.ఈ సందర్భంగా పాల్గొన్న క్రీడాకారులు, కోచ్‌లు మరియు నిర్వాహకులకు అభినందనలు తెలియజేస్తూ, ఎంపికయ్యే క్రీడాకారులు భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించిన బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి.ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ బసుపల్లి నాగదీప్ గౌడ్, జ్ఞానేశ్వర్, మనోహర్, తేజ తదితరులు పాల్గొన్నారు.



# ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి

గ్రామ పంచాయతీల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి: మంత్రి సీతక్క





**వలిగొండ, సెప్టెంబర్ 30 ( తొలివార్త ):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ఉపాధి హామీ పథకం అమలు, గ్రామాల సమగ్ర అభివృద్ధిపై పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క బుధవారం రాష్ట్రంలోని సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో దృశ్య శ్రవణ మాధ్యమం ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతి, ఉపాధి హామీ పథకం అమలు తీరు, నీటి ఇంకుడు గుంతల నిర్మాణం, వాతావరణ పరిస్థితుల ప్రభావం, గ్రామాల్లో చేపట్టాల్సిన పనులు తదితర అంశాలపై మంత్రి సీతక్క అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో భాగంగా వలిగొండ మండల పరిషత్ కార్యాలయంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. పాధి హామీ పథకానికి సంబంధించిన సిబ్బంది కూడా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి, నోడల్ అధికారి జి. జలంధర్ రెడ్డి, మండల పంచాయతీ అధికారి వై. ప్రేమలత, సహాయ కార్యక్రమ అధికారి పరశురాములు, మండల సమాఖ్య ప్రాజెక్టు అధికారి అంజయ్యతో పాటు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. ప్రభుత్వ మార్గదర్శకాలను సమర్థవంతంగా అమలు చేయాలి గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని మంత్రి సీతక్క సూచించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, నీటి సంరక్షణ, నీటి ఇంకుడు గుంతల నిర్మాణం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వాతావరణ పరిస్థితుల వల్ల కలిగే ప్రభావాలను ముందుగానే గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి గ్రామ పంచాయతీల పరిధిలో చేపడుతున్న ప్రతి అభివృద్ధి పనిని అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని, పనుల నాణ్యత విషయంలో రాజీపడకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గ్రామ ప్రజలకు నేరుగా ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇచ్చి వాటిని పూర్తి చేయాలని తెలిపారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాలను పరిశుభ్రంగా, అభివృద్ధి చెందిన గ్రామాలుగా తీర్చిదిద్దాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి మెరుగైన పనితీరు కనబరిచే గ్రామ పంచాయతీలను ఆదర్శ గ్రామాలుగా గుర్తించడంతో పాటు ప్రోత్సాహక బహుమతులు కూడా అందించే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు.

# తుమ్మలచెరువు తూము లాకులు తీసి పంట పొలాలకు నీరు విడుదల చేసిన

అపర భగీరథుడు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు





**భద్రాద్రి జిల్లా సెప్టెంబర్ 30 ( తొలివార్త ):** అశ్వాపురం మండలం మారెళ్ళపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా గోదావరి జలాలను తుమ్మల చెరువు ఆయకట్టుకు తరలించి, అక్కడి నుంచి తూముల ద్వారా పంట పొలాలకు సాగునీటిని విడుదల చేసే కార్యక్రమంలో నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత అపర భగీరథుడు పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్వయంగా తూముల లాకులు తీసి గోదావరి జలాలను పంట పొలాలకు విడుదల చేశారు. మారెళ్ళపాడు లిఫ్ట్ ద్వారా గోదావరి నీటిని తుమ్మల చెరువులోకి ఎత్తిపోసి, అక్కడి నుంచి తూముల ద్వారా ఆయకట్టు పరిధిలోని పంట పొలాలకు సాగునీరు అందేలా నీటి విడుదల ప్రక్రియను ఎమ్మెల్యే పరిశీలించారు. గోదావరి జలాలు తుమ్మల చెరువు ఆయకట్టుకు చేరడంతో సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఎంతో ప్రయోజనం కలగనుంది. మారెళ్ళపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా గోదావరి జలాలను ఆయకట్టు ప్రాంతాలకు అందుబాటులోకి తీసుకురావడం వల్ల పంటల సాగుకు మరింత భరోసా కలుగుతుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు.రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా నీటి విడుదలకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు, సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. తూముల ద్వారా ఆయకట్టు పరిధిలోని పంట పొలాలకు నీరు సక్రమంగా చేరేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.మారెళ్ళపాడు లిఫ్ట్ ద్వారా గోదావరి జలాలు తుమ్మల చెరువు ఆయకట్టుకు చేరి, తూముల లాకులు తెరిచి పంట పొలాలకు నీటిని విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు రైతులు ప్రజలు మరియు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రజాప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి,ఊస అనిల్ కుమార్ వరలక్ష్మి కన్స్ట్రక్షన్ అధినేత వేములపల్లి రమేష్,తుక్కాని మధుసూదన్ రెడ్డి, ఆవుల రవి బేతం రామకృష్ణ, చెంచాల రాము బచ్చు వెంకటరమణ తూము పెద్ద వీర రాఘవులు మట్ట వీరభద్రారెడ్డి గాదె ప్రతాపరెడ్డి కందాల వెంకటరెడ్డి,లంక మల్ల కొండలరావు, గొల్లపల్లి నరేష్ విజయ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామపంచాయతీల సర్పంచులు ఉపసర్పంచులు వార్డు మెంబర్లు మరియు మాజీ ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చౌటుప్పల్ లో చేనేత పారిశ్రామిక సహకార సంఘం 51వ వార్షిక, 65వ సర్వసభ్య సమావేశం

**చౌటుప్పల్, సెప్టెంబర్ 30 ( తొలివార్త ):** చేనేత పారిశ్రామిక సహకార-వస్త్ర ఉత్పత్తి విక్రయ సంఘం ఆధ్వర్యంలో 51వ వార్షిక, 65వ సర్వసభ్య సమావేశం చౌటుప్పల్ పట్టణంలోని పద్మ వంశీ ఫంక్షన్ హల్ లో బుదవారం చేనేత సహకార సంఘం అధ్యక్షులు బడుగు మోహన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా చౌటుప్పల్ మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్,పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ముందుగా







సంఘ మేనేజర్ రాపోలు శ్రీరాములు అంచనా ఆదాయాలు,జమా ఖర్చులను చదివి వినిపించగా సర్వసభ్య సమావేశము ఆమోదించింది. ఈ సందర్భంగా సంఘ చైర్మన్ బడుగు మోహన్ మాట్లాడుతూ.. కార్మికులకు చేతినిండా పని కల్పించి చౌటుప్పల్ చేనేత సహకార సంఘానికి పూర్వవైభవం తీసుకురావడానికి కృషి చేస్తానని అన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మండల మాజీ ఎంపీపీ చిక్క నరసింహ,మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ లు బడుగు మాణిక్యం,బడుగు లక్ష్మయ్య,19వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మధుసూదన్,జిల్లా చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు గుర్రం నరసింహ,చౌటుప్పల్ చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షులు గోశిక చక్రపాణి,గుర్రం రవీందర్, కందగట్ల బిక్షపతి,శ్రీ శివ భక్త మార్కండేయ దేవస్థానం అధ్యక్షులు బడుగు ప్రకాష్,మాజీ ఎంపీటీసీ పెద్దికృష్ణ,చేనేత సహకార సంఘం ఉపాధ్యక్షులు గోశిక శ్రీకాంత్,కార్యదర్శి కాటాబత్తిని భీమయ్య, కోశాధికారి బడుగు సావిత్రి,డైరెక్టర్లు బత్తుల మానస,పాపని రామకృష్ణ,గోశిక లక్ష్మీపతి,గోశిక నరసింహ,దోర్నాల లక్ష్మీనారాయణ,సంఘ సేల్స్ మెన్ గోశిక ప్రభాకర్,నార్కట్పల్లి సేల్స్ మెన్ పాపని వాసుదేవ్,సంఘం ఇన్చార్జి గోశిక ధనంజయ,సంఘం అటెండర్ ఎరుకల రాములు మరియు అధిక సంఖ్యలో చేనేతకుల బాంధవులు పాల్గొన్నారు.

# తూప్రాన్ పేట వృద్ధురాలు మంటిపల్లి యాదమ్మ హత్య కేసులు చేదించిన చౌటుప్పల్ పోలీసులు

నిందితుడు మంటిపల్లి రాజు అరెస్ట్

బంగారం,వెండి వస్తువులు, ఫోన్,బైక్ స్వాధీనం

**చౌటుప్పల్, సెప్టెంబర్ 30 ( తొలివార్త ):** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తూప్రాన్ పేట గ్రామానికి చెందిన మంటిపల్లి యాదమ్మ(70) ఈనెల 27 న ఉదయం 10:00 గంటలకు అనుమాన స్థితిలో మృతి చెందిన సంఘటనపై మంటిపల్లి దర్శన్ చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు మేరకు చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ లో క్రైమ్ నంబర్ 538/2026,సెక్షన్ 194 బిఎన్ఎస్ఎస్ అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసిన పోలీసులు చౌటుప్పల్ డి.ఎస్.పి పి.మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించారు.మృతురాలి మృతదేహానికి చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులచే పోస్టుమార్టంనిర్వహించగామృతదేహంపై ఉన్న గాయాలు మరియు పోస్టుమార్టం ప్రాథమిక వివరాల ఆధారంగా ఆమె మరణం హత్యకు గురైనట్లుగా అనుమానం ఏర్పడింది.దీంతో చౌటుప్పల్ పోలీసులు సాంకేతిక ఆధారాలు,కాల్ డేటా రికార్డులు(సీడీఆర్) మరియు ఇతర అందుబాటులో ఉన్న ఆధారాలను వివిధ కోణాల్లో విశ్లేషించి దర్యాప్తు కొనసాగించారు.ఈ దర్యాప్తులో మంటిపల్లి రాజు(31)తండ్రి దర్శన్,కులం: యాదవ్,వృత్తి:పాల వ్యాపారం,నివాసం బ్యాంక్ కాలనీ,తూప్రాన్‌పేట్ గ్రామం,చౌటుప్పల్ మండలం,యాదాద్రి భువనగిరి జిల్లా పై అనుమానం ఏర్పడింది.బుధవారం ఉదయం మంటిపల్లి రాజును అతని నివాసం వద్ద పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా,అప్పుల కారణంగా ఈఎంఐ లు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నానని,డబ్బుల కోసం తనకు వరుసకు అమ్మమ్మ అయిన మంటిపల్లి యాదమ్మను హత్య చేసి,ఆమె వద్ద ఉన్న బంగారం మరియు వెండి ఆభరణాలను దొంగిలించినట్లు పోలీసుల విచారణలో వెల్లడించినట్లు తెలిపారు.పోలీస్ వారు మంటిపల్లి రాజును అరెస్ట్ చేసి జుడీష్యల్ రిమాండ్ కి తరలించినారు.ఈ కేసు విచారణ డిఎస్పి పి.మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో యేర్పాటు చేసిన బృందం

1)జి. మన్మధ కుమార్,పోలీస్ ఇన్స్పెక్టర్,చౌటుప్పల్ పోలీస్ స్టేషన్

2) పి.రవీందర్,సబ్ ఇన్స్పెక్టర్,చౌటుప్పల్ పోలీస్ స్టేషన్,

3)సతీష్,సబ్ ఇన్స్పెక్టర్, రామన్నపేట పోలీస్ స్టేషన్,మరియు సిబ్బంది నర్సిరెడ్డి,హెచ్ సి, సందీప్,బరద్వాజ్,ప్రవీణ్ పి.సి లు దర్యాప్తు చేసి కేసు ఛేదించడం జరిగింది. నిందితుని వద్ద స్వాధీనం చేసుకున్న వస్తువులు








**బంగారు ఆభరణాలు**

1)పొడవాటి బంగారు గొలుసు (లాంగ్ చైన్)-సుమారు 03 తులాలు

2)బంగారు గొలుసు (చైన్)-సుమారు 01.5 తులాలు

3)బంగారు చెవి దుద్దులు (ఇయర్ స్టడీస్ )-సుమారు 0.5 గ్రాములు

4)బంగారు మాటీలు (మాటీస్)02-సుమారు 0.4 గ్రాములు.

**వెండి ఆభరణాలు**

1)వెండి కాలి కడియాలు (లెగ్ అంకెలెట్స్)ఒక జత-సుమారు 90 తులాలు

2)వెండి కాళ్ల సలాం కడియాలు(సలాం అంకెలెట్స్)ఒక జత-సుమారు 40 తులాలు

3)వెండి కాలి గొలుసులు (లెగ్ చైన్స్)ఒక జత-సుమారు 29 తులాలు.

మొబైల్ ఫోన్ వివో వై 20జి కంపెనీకి చెందిన స్కై బ్లూ రంగు స్మార్ట్ మొబైల్ ఫోన్

**ద్విచక్ర వాహనం**

బ్లాక్ అండ్ బ్లూ రంగు ప్యాషన్ ప్లస్ మోటార్ బైక్ రిజిస్ట్రేషన్ నంబర్.టీజీ30బి 4845 లను స్వాధీనం చేసుకున్నామని చౌటుప్పల్ సిఐ జి.మన్మధకుమార్ తెలిపారు.

# ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు చేతుల మీదుగా లబ్ధిదారులకు

కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ





భద్రాద్రి జిల్లా **సెప్టెంబర్ 30 ( తొలివార్త ):** దుమ్ముగూడెం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కల్యాణ లక్ష్మి -- షాదీ ముబారక్ చెక్కులు, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల వివాహం చేసుకుని కల్యాణ లక్ష్మి -- షాదీ ముబారక్ పథకానికి దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారుల కుటుంబానికి మంజూరైన ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అధికారుల సమన్వయంతో లబ్ధిదారులకు అందజేశారు. అలాగే అర్హులైన కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులను కూడా పంపిణీ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మండల, నాయకులు సత్యాలు సత్యనారాయణ, ఎమ్మార్వో మరియు ఎంపీడీవో అధికారులు, సర్పంచులు ఉపసర్పంచులు మాజీ ప్రజా ప్రతినిధులు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు, ఆదివాసి సంఘాల నాయకులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి ఎఫ్ ఎల్ ఎన్ సెల్ కు సాలికినేని రాజశేఖర్ ఎంపిక అభినందనలు తెలిపిన ప్రముఖులు



**భద్రాద్రి జిల్లా సెప్టెంబర్ 30 ( తొలివార్త ):** పాల్వంచ మండల విద్యాశాఖలో తన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ విద్యాభివృద్ధికి సేవలందించిన సాలికినేని రాజశేఖర్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎఫ్ ఎల్ ఎన్ సెల్ / డిపిఎం యు లో తెలుగు విషయ నిపుణులుగా విధులు నిర్వహించేందుకు,ఎంపికయ్యారు. ఈ,సందర్భంగా,జడ్.పి.హెచ్.ఎస్ యానంబైలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. ప్రకాశరావు సిఆర్పి, శెట్టిపల్లి ప్రభాకర్ రాజశేఖర్ కి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.మండల స్థాయిలో తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించిన రాజశేఖర్ తన ప్రతిభ, అనుభవం మరియు సేవాభావంతో జిల్లా స్థాయిలో కొత్త బాధ్యతలను స్వీకరించనున్నారు. జిల్లా స్థాయిలో కూడా తన జ్ఞానం, అనుభవంతో విద్యార్థుల అభ్యసనాభివృద్ధికి మరింతగా కృషి చేయాలని ప్రధానోపాధ్యాయులు బి. ప్రకాశరావు, సి ఆర్ పి, శెట్టిపల్లి ప్రభాకర్ ఆకాంక్షించారు. రాజశేఖర్ నూతన బాధ్యతలు విజయవంతంగా కొనసాగాలని కోరుకుంటూ హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

# కాటాయగూడెం పాఠశాలకు బెంచీల వితరణ కార్యక్రమంలో పాల్గొన్న

భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు



భద్రాచలం **సెప్టెంబర్ 30 ( తొలివార్త ):** దుమ్ముగూడెం మండలం , కాటాయగూడెం గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలకు పాఠశాల ఉపాధ్యాయురాలు గంధం సునీత, ఆమె భర్త, లయన్స్ క్లబ్ సభ్యులు భీమవరపు వెంకటరెడ్డి బెంచీలను బహూకరించారు. ఈ సందర్భంగా బెంచీలను,(బల్లాలు) భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు చేతుల మీదుగా పాఠశాల విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులకు సౌకర్యవంతమైన విద్యాభ్యాస వాతావరణం కల్పించేందుకు బెంచీలను అందించడం,అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తెల్లం హరికృష్ణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 41 ఏళ్ల సుదీర్ఘ పోలీస్ సేవలకు వీడ్కోలు ఆర్ ఎస్ ఐ ఏ. కృష్ణారెడ్డి పదవీ విరమణ





**మల్కాజ్గిరి సెప్టెంబర్ 30 ( తొలివార్త ):** మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఆర్ఎస్ఐ కృష్ణారెడ్డి తన సుదీర్ఘ పోలీస్ సేవలను పూర్తి చేసుకుని పదవీ విరమణ సందర్భంగా మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి చేతుల మీదుగా పదవి విరమణ సర్టిఫికెట్‌ను అందుకున్నారు. లింగోజిగూడ డివిజన్ మణిపూరి కాలనీకి చెందిన ఏ కృష్ణారెడ్డి కృష్ణారెడ్డి 1985 సంవత్సరంలో రంగారెడ్డి జిల్లాలో పోలీస్ కానిస్టేబుల్‌గా నియమితులయ్యారు. తన 41 ఏళ్ల సుదీర్ఘ సేవా కాలంలో సి ఐ డి, గ్రేహౌండ్స్ ,సి.బి.ఐ, ఇంటిలిజెంట్ , పిటిసి, అంబర్‌పేట్, వనస్థలిపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ తదితర విభాగాల్లో వివిధ హోదాల్లో విధులు నిర్వహించారు. పోలీస్ శాఖలో అంకితభావంతో, క్రమశిక్షణతో విధులు నిర్వహించి ఆర్ ఎస్ ఐ హోదాలో పదవీ విరమణ చేసిన కృష్ణారెడ్డి ని ఈ సందర్భంగా అధికారులు, సహచర సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి కి పుష్పగుచ్ఛం అందజేసి, పదవీ విరమణ కార్యక్రమాన్ని గౌరవప్రదంగా నిర్వహించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీ లు, పోలీస్ అసోసియేషన్ అధికారులు మరియు కుటుంబసభ్యులు రూప, ప్రవీణ్ రెడ్డి, లక్షిత, విహా, ప్రణిత పాల్గొన్నారు.

# రైతులు విధిగా ఫార్మర్ ఐడి క్రాప్ బుకింగ్ చేయించుకోవాలి

పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల పిలుపు



భద్రాద్రి జిల్లా **సెప్టెంబర్ 30 ( తొలివార్త ):** రైతులు విధిగా ఫార్మర్ ఐడి, క్రాప్ బుకింగ్ లు విధిగా చేయించుకోవాలని పాల్వంచ సొసైటీ అధ్యక్షులు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పాల్వంచ సొసైటీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా,కొత్వాల,మాట్లాడుతూ రైతులకు డిజిటల్ అగ్రి కల్చర్ మిషన్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించే గుర్తింపు కార్డుకు విధిగా బుకింగ్,చేయించుకోవాలన్నారు. దీని వలన పి.ఎం. కిసాన్ నిధులు, రైతు భరోసా, పంట నష్టపరిహారం వంటి నగదు బదిలీలు నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతాయన్నారు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సన్న ధాన్యానికి క్వింటాకు 500 రూ॥లు బోనస్ పొందాలంటే పంట సాగు వివరాలు (క్రాప్ బుకింగ్) నమోదు చేయించుకోవాలన్నారు రైతులు సకాలంలో రుణాలు చెల్లించి లి3 శాతం వడ్డీ రాయితీని లిపొందవచ్చు అని అన్నారు. రైతులు సొసైటీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కొత్వాల అన్నారు. ఈ సమావేశంలో సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, డైరెక్టర్లు కనగాల నారాయణ రావు, సామా జనార్ధన్ రెడ్డి, చౌగాని పాపారావు, భూక్యా కిషన్, యర్రంశెట్టి మధుసూధన్ రావు, సి.ఇ.ఒ. జి. లక్ష్మీ నారాయణతదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యకరమైన భోజనం అంటే ఏమిటి? 'ప్లేట్ ఫార్ములా' ఏం చెబుతోంది

**ఆరోగ్యకరమైన భోజనానికి నిపుణుల 'ప్లేట్ ఫార్ములా'**

**ప్లేటులో సగం భాగం పండ్లు, కూరగాయలతో నింపాలి**

**పావు వంతు చిరుధాన్యాలు, మరో పావు వంతు ప్రొటీన్లు తప్పనిసరి**

**ఉప్పు, చక్కెర, ప్రాసెస్ చేసిన ఆహారానికి దూరంగా ఉండాలి**

**శరీరానికి తగినన్ని నీళ్లు తాగడం చాలా ముఖ్యం**

మనం రోజూ తినే ఆహారమే దాదాపుగా మన ఆరోగ్యాన్ని నిర్ణయిస్తుంది. అయితే, ఏది తినాలి, ఏది తినకూడదు, ఎంత తినాలి అనే విషయాలపై చాలామందికి గందరగోళం ఉంటుంది. ఈ నేపథ్యంలో, సుమారు 25 ఏళ్ల అనుభవం ఉన్న ప్రముఖ వైద్య నిపుణుడు, అలెంబిక్ ఫార్మాస్యూటికల్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఓంకార్ స్వామి, ఆరోగ్యకరమైన భోజనం కోసం ఒక సులభమైన 'ప్లేట్ ఫార్ములా'ను సూచిస్తున్నారు. కఠినమైన డైట్ నియమాలు పాటించకుండా, కేవలం ప్లేటులో పదార్థాలను సరిగ్గా సర్దుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించవచ్చని ఆయన వివరిస్తున్నారు. ఈ మేరకు హిందూస్థాన్ టైమ్స్ ఓ కథనం వెలువరించింది.

### ప్లేటులో సగం కూరగాయలు, పండ్లే ఉండాలి

మనం తినే ప్లేటులో సగం భాగం తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో నింపి ఉండాలని డాక్టర్ ఓంకార్ స్వామి చెబుతున్నారు. వీటిలో విటమిన్లు, మినరల్స్, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడమే కాకుండా, జీర్ణవ్యవస్థను మె రుగుపరుస్తాయి. వివిధ రంగుల కూరగాయలు, పండ్లను ఎంచుకోవడం ద్వారా శరీ రానికి అవసరమైన విభిన్న పోషకాలు అందుతాయి.

### పావు వంతు సంపూర్ణ ధాన్యాలు, చిరుధాన్యాలు

ప్లేటులోని మరో పావు వంతులో సంపూర్ణ ధాన్యాలు, చిరుధాన్యాలు (మిల్లెట్స్) ఉండాలి. గోధుమ, బియ్యం వంటి వాటికి బదులుగా రాగులు, జొన్నలు, సజ్జలు, బ్రౌన్ రైస్ వంటి వాటిని ఎంచుకోవడం ఉత్తమం. ఇవి శరీరానికి అవసరమైన శక్తిని అందించడంతో పాటు, అధిక ఫైబర్ కంటెంట్ వల్ల కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తాయి. జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరచడంలో ఇవి కీలకపాత్ర పోషిస్తాయి.

### మరో పావు వంతు ప్రొటీన్లు

కండరాల నిర్మాణం, కణజాలాల మరమ్మతు, హార్మోన్ల ఉత్పత్తికి ప్రొటీన్లు అత్యవసరం. ప్లేటులోని మిగిలిన పావు భాగంలో పప్పుధాన్యాలు, పాలు, పెరుగు, గుడ్లు, మాంసం, చేపలు, సోయా, నట్స్ వంటి ప్రొటీన్లు అధికంగా ఉండే ఆహారాలు తీసుకోవాలి. శాఖాహారులు, మాంసాహారులు తమకు అందుబాటులో ఉన్న ప్రొటీన్ వనరులను ఎంచుకోవచ్చు.

### ఈ జాగ్రత్తలు తప్పనిసరి

శరీరానికి కొవ్వులు కూడా అవసరమే అయినప్పటికీ, వాటిని మితంగా తీసుకోవాలి. ముఖ్యంగా నట్స్, విత్తనాలు, ఆలివ్ ఆయిల్



వంటి మంచి కొవ్వులను ఎంచుకోవాలి. ప్రాసెస్ చేసిన ఆహారాలు, అధిక ఉప్పు, చక్కెర కలిపిన శీతలపానీయాలకు వీలైనంత దూరంగా ఉండటం మంచిది. ఇవి ఊబకాయం, రక్తపోటు, మధుమేహం, గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతాయి. వీటన్నిటితో పాటు, రోజూ తగినన్ని నీళ్లు తాగడం కూడా చాలా ముఖ్యమని, ఇది జీవక్రియలను సక్రమంగా నడిపిస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. ఈ సూచనలు కేవలం సాధారణ అవగాహన కోసం మాత్రమేనని, ప్రతి ఒక్కరి శరీరాకృతి, ఆరోగ్య అవసరాలు వేర్వేరుగా ఉంటాయని, అందుకే వ్యక్తిగత సలహా కోసం తప్పనిసరిగా వైద్యుడిని సంప్రదించాలని డాక్టర్ ఓంకార్ స్వామి స్పష్టం చేశారు

# కళ్లలో కనిపించే ఈ మార్పులు గుండెపోటుకు సంకేతాలా

**కంటి రెటీనా ద్వారా రక్తనాళాల ఆరోగ్యాన్ని అంచనా వేయొచ్చంటున్న నిపుణులు**

**అధిక రక్తపోటు ప్రభావాలు కంటిలో కనిపించవచ్చని వెల్లడి**

**రెటీనాలో చిన్న రక్తస్రావాలు హెచ్చరిక సంకేతాలని వివరణ**

**గుండెపోటు, పక్షవాతం ముప్పుపై పరిశోధనలు**

**యూకే బయోబ్యాంక్ అధ్యయనాల్లో కీలక వివరాలు**

కళ్లు మనకు ప్రపంచాన్ని చూపించడమే కాదు.. మన శరీరంలో దాగి ఉన్న అనారోగ్య సమస్యల గురించి కూడా ముందస్తు సంకేతాలు ఇస్తాయి. ముఖ్యంగా గుండెకు ముప్పు పొంచి ఉందా? రక్తనాళాల్లో ఏవైనా మార్పులు చోటుచేసుకుంటున్నాయా? వంటి విషయాలను కంటి వెనుక భాగంలో ఉండే రెటీనా ద్వారా గుర్తించే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. సాధారణ కంటి పరీక్షల్లోనే గుండె జబ్బుల ముప్పును అంచనా వేసే సరికొత్త విధానాలపై పరిశోధనలు జరుగుతున్నాయి. మరి కంటిలో కనిపించే మార్పులకు, గుండె ఆరోగ్యానికి సంబంధం ఏంటి? రెటీనా పరీక్ష గుండెపోటు ముప్పును ఎలా పసిగడుతుంది?

### కంటితోనే రక్తనాళాల పరిశీలన

మన శరీరంలో రక్తనాళాలను ఎలాంటి శస్త్రచికిత్స లేకుండా నేరుగా పరిశీలించగలిగే అరుదైన భాగం రెటీనా. కంటి వెనుక ఉండే ఈ పొరలో అతి చిన్న రక్తనాళాలు ఉంటాయి. అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్, ఇన్ఫ్లమేషన్ వంటి సమస్యలు రక్తనాళాలపై ప్రభావం చూపినప్పుడు రెటీనాలోనూ మార్పులు కనిపిస్తాయి. అందుకే కంటి పరీక్షలు కేవలం చూపు సమస్యలకే పరిమితం కాకుండా, శరీరంలోని రక్తనాళాల ఆరోగ్యాన్ని అంచనా వేయడంలోనూ ఉపయోగపడతాయని నిపుణులు వివరిస్తున్నారు. రెటీనాలోని రక్తనాళాల పరిమాణం, ఆకృతి, వాటి మధ్య ఏర్పడే మార్పులు ఆరోగ్య సమస్యలను సూచిస్తాయి.రక్తనాళాలు సన్నబడటం: అధిక రక్తపోటు కారణంగా రక్తనాళాల గోడలు మందంగా మారి, లోపలి మార్గం సన్నబడవచ్చు.రక్తనాళాల మధ్య మార్పులు: గట్టిపడిన ధమనులు పక్కనే ఉండే సిరలపై ఒత్తిడి కలిగించవచ్చు. దీన్ని ఏవీ నికింగ్ అంటారు.స్వల్ప రక్తస్రావాలు: రెటీనాలో చిన్న చిన్న రక్తస్రావాలు, మచ్చలు కనిపించడం రక్తనాళాల దెబ్బతినడానికి సంకేతం కావచ్చు.కొలెస్ట్రాల్ మచ్చలు: అరుదుగా రెటీనాలో పసుపు రంగులో కొలెస్ట్రాల్ గడ్డలు కనిపించవచ్చు. ఇవి తీవ్రమైన రక్తనాళాల సమస్యలకు సంకేతం కావొచ్చు.

### గుండెపోటు ముప్పును అంచనా వేయొచ్చా



సాధారణంగా గుండె జబ్బుల ముప్పును అంచనా వేయడానికి వయసు, రక్తపోటు, కొలెస్ట్రాల్, ధూమపానం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. అయితే, కొందరిలో ఈ వివరాలు సాధారణంగానే ఉన్నా గుండె సంబంధిత సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో రెటీనా పరీక్షలు అదనపు సమాచారాన్ని అందించగలవని పరిశోధనలు సూచిస్తున్నాయి.యూకే బయోబ్యాంక్ ఆధారంగా రూపొందించిన నమూనాలతో సహా పలు అధ్యయనాలు రెటీనాలోని రక్తనాళాల వెడల్పు, వంపులు, విభజన తీరును విశ్లేషించాయి. కృత్రిమ మేధ సాయంతో ఈ మార్పులను పరిశీలించి రక్తనాళాల వయసును అంచనా వేయవచ్చని గుర్తించాయి. ఈ విధానం గుండెపోటు, పక్షవాతం ముప్పును అంచనా వేయడంలో సాధారణ రిస్క్ కాలిక్యులేటర్లతో సమానమైన సమాచారాన్ని అందించగలదని కొన్ని అధ్యయనాలు వెల్లడించాయి. అయితే, ఇప్పటికే ఉన్న పరీక్షలకు రెటీనా సమాచారాన్ని జోడించడం వల్ల ప్రతిసారీ అంచనా కచ్చితత్వం గణనీయంగా పెరగడం లేదని కూడా పరిశోధనలు చెబుతున్నాయి.

### కంటి పరీక్షల్లో మార్పులుంటే ఏం చేయాలి

కంటి పరీక్షల్లో రక్తనాళాలు సన్నబడటం, అధిక రక్తపోటు ప్రభావాలు కనిపిస్తే వాటిని నిర్లక్ష్యం చేయకూడదు. ముఖ్యంగా మధుమేహం, అధిక రక్తపోటు, గుండె జబ్బుల కుటుంబ చరిత్ర ఉన్నవారు వైద్యులను సంప్రదించాలి. అవసరమైతే గుండెకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలి. రెటీనా పరీక్ష ఒక్కటే గుండెపోటును నిర్ధారించలేదు. గుండె ఆరోగ్యాన్ని అంచనా వేయడానికి వైద్యుల సూచనల మేరకు ఇతర పరీక్షలూ అవసరం. కంటి పరీక్షలను క్రమం తప్పకుండా చేయించుకోవడం ద్వారా కొన్ని ఆరోగ్య సమస్యల సంకేతాలను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుంది.

# పండ్లు ఎక్కువగా తింటే బరువు పెరుగుతారా, నిపుణులు ఏం చెబుతున్నారంటే

**ఎక్కువగా తింటే మొత్తం క్యాలరీలు పెరగొచ్చని వెల్లడి**

**మామిడి, అరటి, ద్రాక్ష, సపోటాలో క్యాలరీలు ఎక్కువ**

**ప్రాసెస్డ్ స్నాక్స్‌కు పండ్లు మంచి ప్రత్యామ్నాయం**

**రోజుకు 2-3 సార్లు తీసుకోవచ్చని సూచన**

**పండ్లతో పాటు ఇతర ఆహారాలనూ తీసుకోవాలని సలహా**

బరువు తగ్గాలని డైట్ మొదలుపెట్టగానే చాలామంది పండ్లను ఎక్కువగా తినడం మొదలుపెడతారు. పండ్లు ఆరోగ్యకరమైనవి కాబట్టి ఎంత తిన్నా బరువు పెరగరని భావిస్తుంటారు. అయితే పండ్లలో విటమిన్లు, మినరల్స్, ఫైబర్ ఉన్నప్పటికీ.. మోతాదుకు మించి తింటే మాత్రం క్యాలరీలు పెరిగి బరువు తగ్గే లక్ష్యానికి ఆటంకం కలగొచ్చని నిపుణులు చెబుతున్నారు.పండ్లలో విటమిన్లు, మినరల్స్, యాంటీఆక్సిడెంట్లు, డైటరీ ఫైబర్ ఉంటాయి. అయితే వాటిలో సహజ చక్కెర కూడా ఉంటుంది. ముఖ్యంగా మామిడి, అరటిపండు, ద్రాక్ష, సపోటా వంటి క్యాలరీలు ఎక్కువగా ఉండే పండ్లను పెద్ద మొత్తంలో తింటే రోజువారీ క్యాలరీలు పెరిగే అవకాశం ఉంటుంది.చిప్స్, ప్రాసెస్డ్ స్నాక్స్, ఎక్కువ క్యాలరీలు ఉండే డెజర్ట్స్‌కు బదులుగా పండ్లను తీసుకోవడం బరువు తగ్గే ప్రయత్నంలో ఉపయోగపడుతుంది. ఉదాహరణకు చిప్స్ ప్యాకెట్‌కు బదులుగా ఆపిల్ లేదా అరటిపండు తింటే మొత్తం క్యాలరీలు తీసుకోవడం తగ్గొచ్చు. అయితే రోజంతా తరచూ పండ్లు తింటూ ఉండటం, 'హెల్తీ ఫుడ్' కాబట్టి పెద్ద మొత్తంలో తీసుకోవడం మాత్రం బరువు తగ్గడాన్ని ప్రభావితం చేయొచ్చు. చాలామంది పెద్దలకు రోజుకు 2-3 సార్లు పండ్లు తీసుకోవడం సాధారణంగా సరైన లక్ష్యమని నిపుణులు సూచిస్తున్నారు. వ్యక్తి



క్యాలరీ అవసరాలు, శారీరక శ్రమ, మొత్తం డైట్‌ను బట్టి ఈ పరిమాణం మారొచ్చు. పండ్ల రసానికి బదులుగా పూర్తిగా పండ్లనే తినడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.అలాగే ఫైబర్, నీరు ఎక్కువగా ఉండే పండ్లను ఎంచుకుని.. వాటిని ప్రొటీన్ లేదా ఆరోగ్యకరమైన కొవ్వులు ఉన్న ఆహారంతో కలిపి తీసుకుంటే ఎక్కువసేపు కడుపు నిండిన భావన ఉండొచ్చు. పండ్లనే పూర్తిగా ఆహారంగా చేసుకుని మిగతా వాటిని పక్కనపెడితే పోషకాల్లో అసమతుల్యత ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# కివీ పండును ఇలా తింటేనే పూర్తి పోషకాలు లభిస్తాయట

**కివీని తొక్కతో తింటేనే ఫైబర్ ఎక్కువగా లభిస్తుందంటున్న నిపుణులు**

**పచ్చి కివీ తొక్కలో పుష్కలంగా యాంటీఆక్సిడెంట్లు**

**తొక్కపై వెంట్రుకల్లాంటివి ఉంటే టవల్‌తో రుద్దితే మేలు**

**గోల్డెన్ కివీ తొక్క తినడానికి మరింత సులభం**

**రోజుకు రెండు కివీలు జీర్ణక్రియకు ఉపయోగపడొచ్చని సూచన**

పచ్చగా.. జ్యూసీగా ఉండే కివీ పండు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని చాలామందికి తెలుసు. అయితే కివీని ఎలా తింటున్నారు? తొక్క తీసేసి లోపలి గుజ్జు మాత్రమే తింటున్నారా? అలా చేస్తే కివీలో ఉండే కొన్ని ముఖ్యమైన పోషకాలను కోల్పోయే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. కివీని ఎంచుకోవడం దగ్గరి నుంచి తినే విధానం వరకు కొన్ని చిన్న మార్పులు చేస్తే మరిన్ని ప్రయోజనాలు పొందొచ్చని సూచిస్తున్నారు.

### పచ్చి కివీని తొక్కతోనే తినొచ్చా

పచ్చి కివీపై చిన్న చిన్న వెంట్రుకల్లాంటి పొర ఉంటుంది. అందుకే చాలామంది తొక్క తీసేసి తింటారు. కానీ తొక్కతో కలిపి తింటే ఫైబర్ ఎక్కువగా లభిస్తుంది. యాంటీఆక్సిడెంట్లు, పాలీఫినాల్స్ కూడా అధికంగా అందుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. జీర్ణక్రియకు ఇది ఉపయోగపడొచ్చు. మలబద్ధకం సమస్య ఉన్నవారికి మల విసర్జన సక్రమంగా ఉండటంలోనూ సహాయపడే అవకాశం ఉంది.

### పొర నచ్చకపోతే ఇలా చేయండి

కివీ తొక్కపై ఉండే వెంట్రుకలు తినడం ఇబ్బందిగా అనిపిస్తే



ముందుగా పండును నీటితో బాగా కడగాలి. తర్వాత శుభ్రమైన కిచెన్ టవల్‌తో మెల్లగా రుద్దాలి. దీంతో బయట ఉండే అదనపు వెంట్రుకలు కొంతవరకు తొలగిపోతాయి. ఆ తర్వాత పలుచని ముక్కలుగా కోసుకుని తొక్కతోనే తినొచ్చు.

### గోల్డెన్ కివీ అయితే మరింత సులభం

గోల్డెన్ కివీ తొక్క పచ్చి కివీతో పోలిస్తే పలుచగా, మెత్తగా ఉంటుంది. దీనిపై వెంట్రుకలు కూడా దాదాపు ఉండవు. అందుకే తొక్కతోనే తినడం సులభం. తొక్కతో తింటే కేవలం గుజ్జు తినడంతో పోలిస్తే ఫైబర్, విటమిన్-ఈ, ఫోలేట్ ఎక్కువగా లభిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

### రోజుకు ఎన్ని కివీలు తినాలి

రోజుకు రెండు కివీలు తినడం జీర్ణవ్యవస్థకు ఉపయోగపడొచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. నాలుగు వారాల పాటు రోజుకు రెండు కివీలు తీసుకున్నవారిపై జరిగిన ఓ అధ్యయనంలో మల విసర్జన మరింత సక్రమంగా జరిగినట్లు గుర్తించారు. మల విసర్జన సులభంగా ఉండటంతో పాటు జీర్ణక్రియకు సంబంధించిన అసౌకర్యం కూడా తగ్గినట్లు అధ్యయనంలో పాల్గొన్నవారు తెలిపారు.

### కివీకి ఫైబర్‌తో పాటు మరో ప్రత్యేకత

కివీలో కరిగే ఫైబర్‌తో పాటు ప్రీబయోటిక్ ఫైబర్ కూడా ఉంటుంది. ఇది పేగుల్లో ఉండే మంచి బ్యాక్టీరియాకు ఆ హారంగా ప నిచేస్తుంది. దీంతో పేగుల ఆరోగ్యానికి మద్దతు లభించొచ్చు. సాధారణ ఫైబర్ సప్లిమెంట్లు ప్ర ధానంగా మలానికి పరిమాణాన్ని పెంచేలా పనిచేస్తే.. కివీలో ఉండే వివిధ రకాల ఫైబర్ పేగుల పనితీరుకు మరింత విస్తృతంగా తోడ్పడే అవకాశం ఉంది.అయితే ప్రతి ఒక్కరి జీర్ణవ్యవస్థ ఒకేలా స్పందించదు. కివీ తిన్న తర్వాత అసౌకర్యం, అలర్జీ వంటి సమస్యలు కనిపిస్తే తినడం ఆపి వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది.

# ఫిట్‌నెస్‌తోనే ఫ్రీ మైండ్ నా సక్సెస్ సీక్రెట్ ఇదే: విరాట్ కోహ్లీ



ఆధునిక క్రికెట్‌లో ఫిట్‌నెస్ ప్రమాణాలను కొత్త శిఖరాలకు చేర్చిన టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, తన అద్భుతమైన ఫామ్ వెనుక ఉన్న అసలు రహస్యాన్ని పంచుకున్నాడు. శారీరక దృఢత్వానికి, మైదానంలో కనబరిచే మానసిక స్పష్టతకు మధ్య బలమైన సంబంధం ఉందని నొక్కిచెప్పాడు. వెస్టిండీస్‌తో జరిగిన వన్డే మ్యాచ్‌లో అజేయంగా 139 పరుగులు చేసిన అనంతరం కోహ్లీ తన ఫిట్‌నెస్ ఫిలాసఫీని వివరించాడు."స్వేచ్ఛగా ఆలోచించే మనసు కోసం, దృఢమైన శరీరం అవసరం" అని కోహ్లీ స్పష్టం చేశాడు. "నేను శారీరకంగా ఫిట్‌గా ఉండటానికే అధిక ప్రాధాన్యం ఇస్తాను. ఆ ఫిట్‌నెస్ వల్లే ఆటను ఎలా ఆడాలో స్పష్టంగా ఊహించుకోగలుగుతాను. ఇది మైదానంలోకి వెళ్లి నా ప్రణాళికలను విజయవంతంగా అమలు చేయడానికి ఉత్తమ అవకాశం కల్పిస్తుంది" అని అన్నాడు. ప్రస్తుతం తన కెరీర్ దశలో, అతిగా దూకుడు ప్రదర్శించకుండా, అలా అని నెమ్మదిగా ఆడకుండా.. సానుకూల దృక్పథంతో తన ఆటలో ఒక కొత్త వర్షన్‌ను ఆవిష్కరించే ప్రయత్నంలో ఉన్నానని కోహ్లీ తెలిపాడు. శారీరకంగా, మానసికంగా ఉత్సాహంగా ఉండటమే ఈ కొత్త విధానానికి కారణమని పేర్కొన్నాడు.కోహ్లీ చెప్పిన ఈ మాటలను వైద్య నిపుణులు కూడా శాస్త్రీయంగా బలపరుస్తున్నారు. క్రమం తప్పకుండా చేసే శారీరక శ్రమ మెదడు పనితీరుపై సానుకూల ప్రభావం చూపుతుందని అంటున్నారు. వ్యాయామం జ్ఞాపకశక్తిని, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, సమాచారాన్ని వేగంగా గ్రహించి ఒత్తిడిలో సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని (ఎగ్జిక్యూటివ్ డెసిషన్-మేకింగ్) పెంచుతుందని చెబుతున్నారు.శారీరకంగా చురుగ్గా ఉండే వ్యక్తులు ఒత్తిడికి గురైనప్పుడు వారి శరీరం భిన్నంగా స్పందిస్తుందని నిపుణులు తెలిపారు. వారిలో ఒత్తిడికి కారణమయ్యే హార్మోన్లు తక్కువ స్థాయిలో విడుదలవుతాయని, హృదయ స్పందనల రేటు కూడా నెమ్మదిగా పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ విధంగా శరీరం, మనసు మధ్య ఉండే బలమైన సంబంధం వల్లే అథ్లెట్లు తీవ్రమైన ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఉంటూ మెరుగైన నిర్ణయాలు తీసుకోగలుగుతారు. మైదానంలో తన విజయాలకు ఫిట్‌నెస్ ఎలా పునాది వేస్తుందో కోహ్లీ చెప్పిన మాటలు ఈ శాస్త్రీయ వాస్తవానికి సరైన నిదర్శనంగా నిలుస్తున్నాయి.

# నేడు వరల్డ్ హార్ట్ డే మహిళల్లో గుండె జబ్బులు. పురుషులకు భిన్నం




ప్రపంచ హృదయ దినోత్సవం (వరల్డ్ హార్ట్ డే) సందర్భంగా మహిళల్లో గుండె సంబంధిత వ్యాధులు, వాటి లక్షణాలు పురుషులతో పోలిస్తే ఎందుకు భిన్నంగా ఉంటాయో కార్డియాలజిస్టులు వివరిస్తున్నారు. గుండెపోటు అనగానే ఛాతీలో తీవ్రమైన నొప్పి, ఆ నొప్పి ఎడమ చేతికి పాకడం వంటివే ప్రధాన లక్షణాలని చాలామంది భావిస్తారు. అయితే, మహిళల విషయంలో ఈ లక్షణాలు ఎప్పుడూ ఒకేలా ఉండవని, కొన్నిసార్లు చాలా భిన్నంగా కనిపించవచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

### పురుషులకు, మహిళలకు తేడా ఎందుకు?

పురుషుల్లో గుండెపోటు వచ్చినప్పుడు ఛాతీలో ఒత్తిడి లేదా నొప్పి చేయి, దవడ వరకు వ్యాపించడం సాధారణంగా కనిపిస్తుందని డాక్టర్ అజీత్ బానా తెలిపారు. మహిళల్లోనూ ఈ లక్షణాలు ఉండవచ్చని, కానీ వీటికి అదనంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అసాధారణమైన అలసట, వికారం, జీర్ణ సమస్యలు, చెమటలు పట్టడం, తల తిరగడం వంటివి కూడా ఉంటాయని ఆయన వివరించారు. ముఖ్యంగా వీపు, భుజాలు, దవడ లేదా పొట్ట పైభాగంలో అసౌకర్యంగా అనిపించడం కూడా గుండె సమస్యకు సంకేతం కావచ్చన్నారు. ఈ లక్షణాలు ఛాతీ నొప్పితో కలిసైనా లేదా అది లేకుండా అయినా రావచ్చని పేర్కొన్నారు.మహిళల్లో కనిపించే లక్షణాలు మనం పుస్తకాల్లో చదివిన దానికి భిన్నంగా ఉంటాయని డాక్టర్ రోహిత్ గోయల్ అన్నారు. "పురుషుల్లో ఎక్కువగా క్లాసిక్ లక్షణాలు కనిపిస్తాయి. కానీ మహిళల్లో నాన్-క్లాసికల్ లక్షణాలు ఎక్కువ. వీటిని తరచుగా ఒత్తిడి, ఆందోళన లేదా అజీర్తి సమస్యలుగా భావించి నిర్లక్ష్యం చేసే ప్రమాదం ఉంది" అని ఆయన హెచ్చరించారు.

### చిన్న రక్తనాళాలే కీలకం

మహిళల శరీర నిర్మాణం, హార్మోనల్ మార్పులు, రక్తనాళాల అమరికలో తేడాలు ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. మహిళల్లో 'కొరొనరీ మైక్రోవాస్కులర్ డిస్‌ఫంక్షన్' అంటే చిన్న రక్తనాళాల్లో సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. దీనివల్ల పెద్ద ధమనుల్లో అడ్డంకులు లేకపోయినా నొప్పి, అలసట వంటివి వస్తాయి. గర్భధారణ సమయంలో ఎదురయ్యే సమస్యలు, మెనోపాజ్ తర్వాత హార్మోన్ల మార్పులు కూడా జీవితకాలంలో గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతాయి.ఈ నేపథ్యంలో, మహిళలు తమ శరీరంలో కనిపించే అసాధారణ లక్షణాలను ఏమాత్రం విస్మరించకూడదని నిపుణులు సూచిస్తున్నారు. ముందస్తు ఆరోగ్య పరీక్షలు, లింగ-నిర్దిష్ట అంచనాలతో ప్రమాదాన్ని ముందుగానే గుర్తించవచ్చని చెబుతున్నారు.

# మన గుండె గురించి ఈ విషయాలు తెలుసా ఒక్కసారి చదవాల్సిందే



గుండె అంటే వెంటనే గుర్తుకొచ్చేది ఛాతీ ఎడమవైపు ఉన్న అవయవమే. చిన్నప్పటి నుంచి మనం కూడా అలాగే అనుకుంటూ వచ్చాం. కానీ గుండె పూర్తిగా ఎడమవైపు ఉండదు. ఛాతీ మధ్య భాగంలో, రెండు ఊపిరితిత్తుల మధ్య ఉంటుంది. కొంత భాగం కుడివైపున కూడా ఉంటుంది. 'ప్రపంచ హృదయ దినోత్సవం' సందర్భంగా గుండె గురించి తెలుసుకోవాల్సిన ఆసక్తికర విషయాలు ఇవి.గుండె రెండు ఊపిరితిత్తుల మధ్య ఉండే మీడియాస్టినమ్ అనే ప్రాంతంలో ఉంటుంది. ఇది ఛాతీ ఎముక వెనుక, డయాఫ్రామ్ పైన ఉంటుంది. గుండె మొత్తం ఎడమవైపే ఉందనడం సరైనది కాదు.గుండె నిటారుగా ఉండదు. దాని చివరి భాగాన్ని అపెక్స్ అంటారు. ఇది కిందికి, ఎడమవైపుకు వంగి ఉంటుంది. అందుకే ఛాతీ ఎడమవైపు గుండె చప్పుడు ఎక్కువగా వినిపిస్తుంది.

### పిడికిలంత పరిమాణం

సాధారణంగా పెద్దవారి గుండె వారి పిడికిలి పరిమాణంలో ఉంటుంది. శరీర పరిమాణం, వయసును బట్టి గుండె పరిమాణంలో కొంత తేడా ఉండొచ్చు.

### గుండెలో నాలుగు గదులు

గుండెలో కుడి కర్ణిక, కుడి జఠరిక, ఎడమ కర్ణిక, ఎడమ జఠరిక అనే నాలుగు గదులు ఉంటాయి. కుడివైపు భాగం శరీరం నుంచి వచ్చిన రక్తాన్ని ఊపిరితిత్తులకు పంపుతుంది. ఎడమవైపు భాగం ఆక్సిజన్ కలిగిన రక్తాన్ని శరీరమంతా పంపుతుంది.

### రెండు వైపులా వేర్వేరు పనులు

గుండె ఒకే అవయవంగా పనిచేసినా దాని కుడి, ఎడమ భాగాలకు వేర్వేరు బాధ్యతలు ఉంటాయి. మధ్యలో ఉండే సెప్టమ్ గోడ ఈ రెండు భాగాలను వేరు చేస్తుంది. దీంతో ఆక్సిజన్ ఉన్న రక్తం, ఆక్సిజన్ తక్కువగా ఉన్న రక్తం సాధారణంగా కలవవు.మన ప్రమేయం లేకుండానే కొట్టుకుంటుంది గుండెను మనం కావాలనుకున్నప్పుడు ఆపలేం. దానికంటూ ప్రత్యేక విద్యుత్ వ్యవస్థ ఉంటుంది. సాధారణంగా సైనోఏట్రియల్ నోడ్ (సా నోడ్) నుంచి విద్యుత్ సంకేతాలు మొదలవుతాయి. ఇవే గుండె కండరాల సంకోచాలను సమన్వయం చేస్తాయి.గుండె చప్పుడు కనిపించే చోటు మారొచ్చు గుండె చప్పుడు సాధారణంగా ఎడమ ఛాతీలోని ఐదో పక్కటెముక మధ్య ప్రాంతంలో స్పష్టంగా అనిపిస్తుంది. అయితే ప్రతి ఒక్కరిలో ఆ ప్రదేశం ఒకేలా ఉండకపోవచ్చు. శరీర నిర్మాణాన్ని బట్టి కొంత తేడా ఉంటుంది.

# బ్రేకింగ్ న్యూస్.. సెప్టెంబర్ లో ఉద్యోగుల జీతాలు తగ్గే అవకాశం..!




కేంద్ర ప్రభుత్వం కనీస వేతన పరిమితిని రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంచిన సంగతి తెలిసిందే. దీంతో చాలా మంది ప్రైవేట్ ఉద్యోగులు పెన్షన్ ప్రయోజనాలు పొందే అవకాశం ఉంది. 2014 సెప్టెంబర్ కనీస వేతన పరిమితిని రూ.15 వేలు చేశారు. దీని ప్రకారం 2014 సెప్టెంబర్ తర్వాత మొదటిసారి ఉద్యోగంలో చేరిన వారి బేసిక్ శాలరీ ప్లస్ డీఏ కలిపి రూ.15 ఉన్నవారు మాత్రమే పెన్షన్ కు అర్హత సాధిస్తారు. రూ.15 వేల కంటే ఎక్కువ బేసిక్ శాలరీ ప్లస్ డీఏ ఉన్నవారు పెన్షన్ పొందలేరు. అయితే ఇప్పుడు కనీస వేతన పరిమితి రూ.25 వేలకు పెంచడంతో మొదటిసారి ఉద్యోగంలో చేరినవారి జీతం(బేసిక్ ప్లస్ డీఏ) రూ.25 వేలు, అంత కంటే తక్కువ ఉంటే పెన్షన్ కు అర్హత సాధిస్తారురూ.25 వేల కంటే ఎక్కువ శాలరీ(బేసిక్ ప్లస్ డీఏ) వస్తే వారికి పెన్షన్ ఉండదు. ఇప్పుడు రూ.25 వేలు కనీస వేతన పరిమితి పెంచడంతో చాలా మంది పెన్షన్ కు అర్హత సాధించే అవకాశం ఉంది. ఇప్పుడు బేసిక్ శాలరీ రూ.25 వేలు ఉన్నవారు పెన్షన్ కు అర్హత సాధిస్తారు. అయితే మొదటి సారి ఉద్యోగంలో చేరినప్పుడు బేసిక్ సాలరీ రూ.25 వేలు ఉండి.. ఆ తర్వాత జీతం పెరిగినా వారు పెన్షన్ పథకంలో కొనసాగుతారు. కంపెనీలు ఇచ్చే పెన్షన్ వాటా గరిష్ట పరిమితి గతంలో రూ.1,250 ఉండేది, ఇప్పుడు రూ.2,083 వరకు పెరుగుతుంది. ఒకవేళ మొదటి ఉద్యోగంలోనే బేసిక్ రూ.25 వేల కంటే ఎక్కువ ఉంటే, ఆ ఉద్యోగికి ఈపీఎస్ ఇవ్వడం కంపెనీకి తప్పనిసరి కాదు. అప్పుడు సంస్థ వాటా మొత్తం కేవలం ఉద్యోగి ఈపీఎఫ్‌కే జమ అవుతుంది. ఉద్యోగులకు షాక్.. ఇక నెలనెల మీ జీతంలో రూ.6000 వేలు కట్..! ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్ఓ) తెచ్చిన ఈ కొత్త రూల్ సెప్టెంబర్ నెల మధ్యలో అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఉద్యోగుల జీతాల్లో తేడాలు వచ్చే అవకాశం ఉంది. ఈ ఒక్క నెల జీతాన్ని రెండు భాగాలుగా లెక్కించనున్నారు. మొదటి 16 రోజులు (సెప్టెంబర్ 1-16) వరకు పాత పద్ధతి ప్రకారమే లెక్కిస్తారు. చివరి 14 రోజులను (సెప్టెంబర్ 17-30) కొత్తగా మారిన రూ.25 వేల పరిమితి ప్రకారం లెక్కించనున్నారు. ఉద్యోగి ఇప్పటికే ఈపీఎస్‌లోకి చేరితే అతని బేసిక్ శాలరీ నెలకు రూ.30 వేలు, రూ.50 వేలు లేదా రూ. లక్ష ఉన్నా సరే.. గరిష్ట సీలింగ్ అయిన రూ.25 వేలపై కంపెనీ వాటా అయిన 2,083 రూపాయలు ఉద్యోగి ఈపీఎస్ ఖాతాలో జమ అవుతుంది. రూ.25,000 దాటిన మిగిలిన మొత్తంపై కంపెనీ చెల్లించాల్సిన వాటా ఆటోమేటిక్‌గా పీఎఫ్ (ఈపీఎఫ్) ఖాతాకే వెళ్లనుంది. బేసిక్ రూ.25 వేలు దాటినంత మాత్రాన కంపెనీ నుంచి ఈపీఎస్ జమ ఆగిపోదని గుర్తుంచుకోవాలి. సెప్టెంబర్ నెలలో ఉద్యోగి చేతికొచ్చే జీతంలో తేడాలు వచ్చే అవకాశం ఉంది. కాగా పలు సంస్థలు డబల్ పీఎఫ్ ఉద్యోగి జీతం నుంచే కట్ చేస్తున్నారు. అంటే.. ప్రస్తుతం విధానం ప్రకారం ఉద్యోగి జీతంలో దాదాపు రూ.6 వేలు కట్ అయి రావచ్చు. జీతాలకు సంబంధించి ఉద్యోగులకు కంపెనీలు ఇప్పటికే మెయిల్స్ పంపాయి.

డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలోకి పోకముందే భారత్ రూటు మార్చాలి..

## శక్తికాంత దాస్ కీలక వ్యాఖ్యలు..



ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఒక చారిత్రాత్మక పరివర్తన దశ గుండా పయనిస్తోంది. శతాబ్దాలుగా పాశ్చాత్య అభివృద్ధి చెందిన దేశాల చుట్టూ తిరిగిన ఆర్థిక కార్యకలాపాల కేంద్రం ఇప్పుడు వేగంగా ప్రాచ్య దేశాల వైపు, ముఖ్యంగా గ్లోబల్ సౌత్ వైపు మళు తోంది. ప్రపంచ వాణిజ్యంలో దీర్ఘకాలంగా తక్కువ ప్రాముఖ్యత కలిగిన దేశాలు ఇప్పుడు గణనీయమైన వాటాను సాధిస్తున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రెండవ ముఖ్య కార్యదర్శి, ఆర్‌బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్ ఈ మార్పును ప్రముఖంగా ప్రస్తావిస్తూ, గ్లోబల్ సౌత్‌లోని ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల భాగస్వామ్యం ప్రపంచ వృద్ధిలో అత్యంత కీలకమైనదిగా మారుతోందని పేర్కొన్నారు. మారుతున్న ఈ ప్రపంచ సమీకరణాలను భారతదేశం సద్వినియోగం చేసుకోవాలంటే కొత్త ఆలోచనలను, సరికొత్త వ్యాపార మార్గాలను అన్వేషించడం అత్యంత ఆవశ్యకం. కోవిడ్-19 మహమ్మారి తదనంతరం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. వివిధ దేశాల మధ్య పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ప్రపంచ వ్యాపారం, సరఫరా గొలుసులపై తీవ్ర అనిశ్చితిని పెంచాయి. ముఖ్యంగా మధ్యప్రాచ్యంలో నెలకొన్న యుద్ధ వాతావరణం, రష్యా-ఉక్రెయిన్ ఘర్షణల వల్ల ముడి చమురు, గ్యాస్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం పెరిగి, వివిధ కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లను గరిష్ఠ స్థాయిలో ఉంచాల్సి వస్తోంది. రెపో రేటు పెంపు వార్తలతో రుణగ్రహీతలకు షాక్.. మీ హోమ్ లోన్, కార్ లోన్ ఎంత పెరుగుతుందంటే.. ఈ పరిస్థితులు ఆర్థిక వ్యవస్థ మందగమనానికి దారితీస్తున్నాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి ఏప్రిల్‌లో ప్రపంచ వృద్ధి రేటును 3.1 శాతంగా అంచనా వేయగా.. ప్రపంచ బ్యాంకు 2026 నాటికి ఇది 2.5 శాతానికి పరిమితం కావచ్చని స్పష్టం చేసింది. ఖరీదైన ఇంధనం, పెరిగిన రవాణా ఖర్చులు, భౌగోళిక ఆందోళనలు ఈ రెండు సంస్థల బలహీనమైన అంచనాలలో స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి. ఇటువంటి సంక్షోభ సమయాల్లోనూ గ్లోబల్ సౌత్ దేశాల ఆర్థిక వాటా క్రమంగా పెరుగుతుండటం విశేషం. ప్రపంచ జనాభాలో అత్యధిక భాగం కలిగిన ఈ ప్రాంతాలు ఇప్పుడు వినియోగానికి, ఉత్పాదనకు పెద్ద కేంద్రాలుగా మారుతున్నాయి. భారతదేశం కూడా తన సాంప్రదాయ వాణిజ్య భాగస్వాములైన అమెరికా, ఐరోపా దేశాలపై మాత్రమే ఆధారపడకుండా, కొత్త మార్కెట్లను వెతుక్కోవాల్సిన అవసరం ఏర్పడింది. ఆఫ్రికన్ యూనియన్, ఆసియాన్, లాటిన్ అమెరికా దేశాలతో వాణిజ్య సంబంధాలను బలపరచుకోవడం ద్వారా భారతీయ కంపెనీలకు అపారమైన అవకాశాలు లభిస్తాయి. సమాచార సాంకేతికత, డిజిటల్ చెల్లింపులు, ఔషధ రసాయనాలు, పునరుత్పాదక ఇంధనం, వ్యవసాయ పరిశోధనలు, మౌలిక వసతుల కల్పన వంటి రంగాలు భారత్ నుండి ఆయా దేశాలకు విస్తరించేందుకు సిద్ధంగా ఉన్నాయి. అయితే ఈ అవకాశాలను అందుకోవడానికి భారత్‌కు వేగం, సమర్థత అవసరం. గ్లోబల్ సౌత్ దేశాలకు భారతదేశం కేవలం ఒక వ్యాపార భాగస్వామిగా మాత్రమే కాకుండా.. 'విశ్వబంధు'గా, అభివృద్ధి నమూనాగా నిలుస్తోంది. భారత్ అభివృద్ధి చేసిన డిజిటల్ ప్రజా మౌలిక వసతులు (యుపిఐ, ఆధార్ వంటివి), తక్కువ ఖర్చుతో కూడిన సాంకేతిక పరిష్కారాలు అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఎంతో ఆదర్శంగా మారాయి. అదే సమయంలో భారత్ అంతర్గతంగా కూడా తన తయారీ రంగాన్ని 'మేక్ ఇన్ ఇండియా', ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ పథకాల ద్వారా మరింత బలోపేతం చేసుకోవాల్సి ఉంది. సరఫరా గొలుసులలో చైనాకు ప్రత్యామ్నాయంగా నిలబడేందుకు భారత్ గ్లోబల్ సౌత్‌తో ద్వైపాక్షిక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను వేగవంతం చేయాలి. ప్రపంచ ఆర్థిక సవాళ్లను తట్టుకుంటూ, పెరుగుతున్న గ్లోబల్ సౌత్ ఆర్థిక శక్తులను కలుపుకొని పోవడం ద్వారానే భారత్ వచ్చే దశాబ్దాల్లో గ్లోబల్ గ్రోత్ ఇంజిన్‌గా అవతరించగలదు. ప్రతికూల పరిస్థితులను అనుకూల అవకాశాలుగా మలచుకొని, నూతన వాణిజ్య రహిత సరిహద్దులను అన్వేషించడంలో భారతదేశం ఎంత వేగంగా వ్యవహరిస్తుంద.

# అమెరికా వెళ్లాలంటే ఏడాది ముందు వీసా కోసం అప్లై చేసుకోవాల్సిందే..




అమెరికా ప్రయాణం చేయాలనుకునే భారతీయ పర్యాటకులు, వ్యాపారవేత్తలకు యూఎస్ విజిటర్ వీసా ఇంటర్వ్యూ స్లాట్ దక్కడం రోజురోజుకూ కష్టతరంగా మారుతోంది. అమెరికా విజిటర్ వీసా ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్ పొందడానికి భారతీయ దరఖాస్తుదారులు సగటున దాదాపు ఏడాది పాటు అంటే 346 రోజులు నిరీక్షించాల్సి వస్తోందని యూఎస్ గవర్నమెంట్ అకౌంటబిలిటీ ఆఫీస్ తమ తాజా నివేదికలో వెల్లడించింది. కోవిడ్-19 మహమ్మారికి ముందు ఉన్న 42 రోజుల సగటు నిరీక్షణ సమయంతో పోలిస్తే ఇది ఏకంగా ఎనిమిది రెట్లు పెరగడం గమనార్హం. ప్రపంచవ్యాప్తంగా పర్యాటక వీసాల కోసం అత్యధిక కాలం వేచి ఉండాల్సిన దేశాల జాబితాలో భారతదేశం ఏడవ స్థానంలో నిలిచింది. కొలంబియా, టర్కీ, కెనడా దేశాలు వరుసగా మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. భారత్ నుంచి అమెరికా వీసాలకు డిమాండ్ విపరీతంగా పెరిగినప్పటికీ.. దానికి అనుగుణంగా యూఎస్ విదేశాంగ శాఖ కాన్సులర్ అధికారులను నియమించకపోవడమే ఈ సుదీర్ఘ ఆలస్యానికి ప్రధాన కారణమని నివేదిక స్పష్టం చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో భారతదేశంలోని యూఎస్ ఎంబసీ, కాన్సులేట్లలో నాన్-ఇమ్మిగ్రెంట్ వీసాలను పరిశీలించేందుకు కేవలం 68 మంది అధికారులు మాత్రమే అందుబాటులో ఉన్నారు. వీరు ఏకంగా 14.55 లక్షల దరఖాస్తులను పరిశీలించాల్సి వచ్చింది. అంటే భారత్‌లోని ప్రతి కాన్సులర్ అధికారి సగటున 21,401 దరఖాస్తుల భారాన్ని మోశారు. ఇది ప్రపంచంలోనే అత్యంత అధిక పనిభారాలలో ఒకటిగా నమోదైంది. చైనాతో పోల్చి చూస్తే భారత్‌లోని కాన్సులర్ అధికారులపై ఎంతటి తీవ్రమైన ఒత్తిడి ఉందో స్పష్టమవుతోంది. చైనాలో 12.06 లక్షల దరఖాస్తుల పరిశీలనకు 119 మంది అధికారులు ఉన్నారు. అంటే అక్కడ ఒక్కో అధికారికి 10,135 దరఖాస్తుల పనిభారం మాత్రమే ఉండటంతో, ఇంటర్వ్యూ నిరీక్షణ సమయం అక్కడ కేవలం 34 రోజులుగానే ముగిసింది. చైనా కంటే భారత్ నుంచే అత్యధికంగా దరఖాస్తులు వచ్చినప్పటికీ, ఇక్కడ 51 మంది అధికారులు తక్కువగా ఉండటం వల్ల నిరీక్షణ సమయం విపరీతంగా పెరిగిపోయింది. మెక్సికోలో కూడా అధికారులు ఎక్కువ దరఖాస్తులను పరిశీలించినప్పటికీ, అక్కడ కూడా భారత్ కంటే 63 రోజులు తక్కువ నిరీక్షణ సమయం నమోదైంది.అమెరికాలో ఇల్లు మారుతున్నారా.. ఇల్లు మారిన 10 రోజుల్లో ఇది చేయడం మర్చిపోవద్దు.. ఈ సుదీర్ఘ వీసా నిరీక్షణ సమయాలు కేవలం ప్రయాణికులనే కాకుండా పర్యాటక దాని ఆర్థిక వ్యవస్థను కూడా తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. గడిచిన ఏడాది అంతర్జాతీయ ప్రయాణాలు, పర్యాటకం ద్వారా అమెరికా ఆలభించిన రాబడి మునుపటి కంటే సుమారు 5 బిలియన్ డాలర్లు తగ్గింది. పర్యాటక వీసాల ప్రాసెసింగ్‌లో జరుగుతున్న ఆలస్యం కూడా ఈ ఆదాయ క్షీణతకు ప్రధాన కారణాలలో ఒకటిగా అధికారులు గుర్తించారు. ప్రపంచవ్యాప్తంగా వేర్వేరు కాన్సులేట్ కార్యాలయాలలో ఉన్న పనిభారాన్ని అంచనా వేసి, తగినట్లుగా సిబ్బందిని క్రమం తప్పకుండా పునర్వ్యవస్థీకరించాలని ఆడిట్ విభాగం సిఫార్సు చేసినప్పటికీ యూఎస్ విదేశాంగ శాఖ స్పందించలేదు. మరోవైపు భారత్‌లో యూఎస్ విజిటర్ వీసాని ఒక సామాజిక హోదాగా భావించి దరఖాస్తు చేసుకుంటారని, నిజంగా ప్రయాణించే ఉద్దేశం లేని ఇటువంటి దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించడానికి అదనపు సమయం పడుతోందని విదేశాంగ శాఖ అధికారులు వ్యాఖ్యానించడం గమనార్హం. అయితే ఈ 346 రోజుల సమయం అనేది కేవలం సగటు గణాంకం మాత్రమేనని, ప్రతి దరఖాస్తుదారునికి ఈ వర్తించదని, దరఖాస్తు కేటగిరీ, అపాయింట్‌మెంట్ లభ్యతను బట్టి వాస్తవ నిరీక్షణ సమయం మారవచ్చని నివేదిక వివరించింది.

# ఏటీఎం లావాదేవీల నుంచి ఎల్పీజీ సబ్సిడీ వరకు.. అక్టోబర్ 1 నుంచి కొత్త రూల్స్

**రూ.2000 దాటిన వ్యాపార యూపీఐ లావాదేవీలపై కొత్త ఫ్రేమ్‌వర్క్**

**సబ్సిడీ ఎల్పీజీ సిలిండర్ కోసం బయోమెట్రిక్ ఆధార్ తప్పనిసరి**

**ఎస్‌బీఐ శాలరీ ఖాతాదారులకు ఏటీఎం ఉచిత లావాదేవీల పరిమితిలో కోత**

**పన్ను చెల్లింపుదారులకు గడువు పొడిగించిన సీబీడీటీ**



అక్టోబర్ నెల గురువారం నుంచి ప్రారంభం కానుండగా, సామాన్యుల ఆర్థిక కార్యకలాపాలపై ప్రభావం చూపే పలు కీలక నిబంధనలు అమల్లోకి రానున్నాయి. బ్యాంకింగ్, పన్నులు, పొదుపు పథకాలు, వంటగ్యాస్ వంటి అనేక రంగాల్లో ఈ మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఈ నేపథ్యంలో వినియోగదారులు, పన్ను చెల్లింపుదారులు ఈ కొత్త నియమాలపై అవగాహన కలిగి ఉండటం చాలా అవసరం.ఈ మార్పులలో ముఖ్యంగా యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)కి సంబంధించి కొత్త నిబంధన అమల్లోకి వస్తోంది. రూ.2,000 మించిన వ్యాపార (మర్చంట్) లావాదేవీలపై కొత్త 'మర్చంట్ డిస్కౌంట్ రేట్' (ఎండీఆర్) ఫ్రేమ్‌వర్క్‌ను వర్తింపజేయనున్నారు. అయితే, ఈ ఛార్జీలను వినియోగదారుల నుంచి వసూలు చేయబోరని, వ్యక్తిగత లావాదేవీలు యథావిధిగా ఉచితంగానే కొనసాగుతాయని స్పష్టతనిచ్చారు. మరోవైపు, పన్ను చెల్లింపుదారులకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఊరట కల్పించింది. 2026-27 అసెస్‌మెంట్ సంవత్సరానికి గాను, ట్యాక్స్ ఆడిట్ రిపోర్ట్ దాఖలు గడువును అక్టోబర్ 21కి, ఆదాయపు పన్ను రిటర్నుల (ఐటీఆర్) ఫైలింగ్ గడువును నవంబర్ 21కి పొడిగించింది.గృహ వినియోగదారులకు సంబంధించి ఎల్పీజీ సిలిండర్ బుకింగ్‌లో కీలక మార్పు రాబోతోంది. అక్టోబర్ 1 నుంచి సబ్సిడీ ధరపై గ్యాస్ సిలిండర్ పొందాలంటే తప్పనిసరిగా బయోమెట్రిక్ ఆధార్ అథెంటికేషన్ పూర్తి చేయాలి. ఈ ప్రక్రియ పూర్తి చేయని వారు మార్కెట్ ధరకు సిలిండర్‌ను కొనుగోలు చేయాల్సి ఉంటుంది.దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) కూడా తన నిబంధనలను సవరించింది. శాలరీ ప్యాకేజీ ఖాతాదారులకు ఇతర బ్యాంకుల ఏటీఎంలలో అందించే నెలవారీ ఉచిత లావాదేవీల సంఖ్యను 10 నుంచి 5కి తగ్గించింది. ఈ పరిమితి ఆర్థిక, ఆర్థికేతర లావాదేవీలు రెండింటికీ వర్తిస్తుంది. 'బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్' (బీఎస్‌బీడీ) ఖాతాలకు నెలకు నాలుగు ఉచిత నగదు విత్‌డ్రాలు కొనసాగుతాయి. ఆ తర్వాత చేసే ప్రతి విత్‌డ్రాపై రూ.15తో పాటు జీఎస్టీ విధిస్తారు.వీటితో పాటు, ప్రవాస భారతీయుల నుంచి ఆస్తులు కొనుగోలు చేసేవారు టీడీఎస్ కోసం ప్రత్యేకంగా టాన్ బదులు పాన్ ఉపయోగించుకోవచ్చు. 'నేషనల్ పెన్షన్ సిస్టమ్' (ఎన్‌పీఎస్)లో కొత్తగా చేరేవారికి రూ.200 ఆన్‌బోర్డింగ్ ఛార్జీ అమల్లోకి వస్తుంది. కాగా, ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ సమావేశం అక్టోబర్ 5 నుంచి 7 వరకు జరగనుంది. వడ్డీ రేట్లపై నిర్ణయాన్ని అక్టోబర్ 7న ప్రకటించనున్నారు. గత సమావేశంలో రెపో రేటును 5.25 శాతం వద్ద యథాతథంగా ఉంచిన విషయం తెలిసిందే.

# టీమిండియా చీఫ్ సెలెక్టర్‌గా ప్రజ్ఞాన్ ఓజా

**ప్రస్తుతం సెలెక్షన్ కమిటీకి తాత్కాలిక హెడ్‌గా ఉన్న ఓజా కోచ్ గంభీర్‌తో గువాహటిలో**

**సమావేశమైన సెలెక్టర్లు న్యూజిలాండ్ పర్యటనకు జట్ల ఎంపికపై సుదీర్ఘ చర్చ**




టీమిండియా మాజీ స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓజా భారత క్రికెట్ జట్టు తదుపరి చీఫ్ సెలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. అజిత్ అగార్కర్ ఈ పదవి నుంచి వైదొలగడంతో, ప్రస్తుతం సెలెక్షన్ కమిటీకి తాత్కాలిక హెడ్‌గా ఉన్న 39 ఏళ్ల ఓజానే పూర్తిస్థాయి చీఫ్ సెలెక్టర్‌గా నియమించనున్నట్లు తెలుస్తోంది.మంగళవారం గువాహటిలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో నలుగురు సెలెక్టర్ల కమిటీ సుదీర్ఘంగా సమావేశమైంది. వెస్టిండీస్‌తో రెండో వన్డేకు ఒకరోజు ముందు బర్సపరా స్టేడియంలో ఈ భేటీ జరిగింది. ఈ సమావేశంలో ప్రజ్ఞాన్ ఓజాతో పాటు శివ సుందర్ దాస్, అజయ్ రాత్రా, ఆర్పీ సింగ్ పాల్గొన్నారు. అయితే, మాజీ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ఇందులో పాలుపంచుకోలేదు. సాధారణంగా ఒక ద్వైపాక్షిక సిరీస్ సమయంలో సెలెక్షన్ కమిటీ మొత్తం ఇలా సమావేశం కావడం అరుదు కావడంతో, ఓజా నియామకం దాదాపు ఖరారైనట్లేనని తెలుస్తోంది. త్వరలో ప్రారంభం కానున్న న్యూజిలాండ్ పర్యటనకు భారత జట్లను ఎంపిక చేసే విషయంపైనే ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. అక్టోబర్ 22 నుంచి నవంబర్ 27 వరకు జరగనున్న ఈ సుదీర్ఘ పర్యటనలో భారత్ ఐదు టీ20లు, ఐదు వన్డేలు, రెండు టెస్టులు ఆడనుంది. దీంతో పాటు, అక్టోబర్ 24 నుంచి న్యూజిలాండ్‌లో మూడు టెస్టులు ఆడనున్న భారత్ 'ఎ' జట్టును కూడా ఎంపిక చేయాల్సి ఉంది.భారత జట్టు వరుస సిరీస్‌లతో తీరిక లేకుండా ఉండటంతో ఆటగాళ్ల వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ కొత్త సెలెక్షన్ కమిటీకి పెద్ద సవాలుగా మారనుంది. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని జట్టు కూర్పును సిద్ధం చేసేందుకు కూడా ఈ పర్యటన కీలకం కానుంది. సీనియర్ జట్టు అవసరాలతో పాటు, భారత్ 'ఎ' కార్యక్రమాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం ఓజా నేతృత్వంలోని కమిటీ ముందున్న ప్రధాన కర్తవ్యం.

# పరుగుల రారాజు.. వయసును జయించిన విరాట్!

**వన్డేల్లో 15,000 పరుగులు పూర్తి చేసిన విరాట్ కోహ్లీ**

**సచిన్ కంటే వేగంగా ఈ మైలురాయిని అందుకున్న వైనం**

**37 ఏళ్ల వయసులోనూ తగ్గని జోరు.. అద్భుత స్ట్రైక్ రేట్‌తో శతకం**

**వెస్టిండీస్‌పై అజేయ శతకంతో జట్టుకు ఘనవిజయం**

**2027 ప్రపంచకప్‌పై దృష్టి సారించినట్లు వెల్లడి**




తిరువనంతపురం వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన వన్డేలో విరాట్ కోహ్లీ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 88 బంతుల్లోనే 139 పరుగులు చేసి అజేయంగా నిలవడమే కాకుండా, వన్డేల్లో 15,000 పరుగుల మైలురాయిని అందుకున్నాడు. అతడి వీరోచిత ఇన్నింగ్స్‌తో భారత్ 50 బంతులు మిగిలి ఉండగానే 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది.ఈ క్రమంలో కింగ్ కోహ్లీ ఎన్నో రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. వన్డేల్లో అత్యంత వేగంగా 15,000 పరుగులు పూర్తి చేసిన ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. ఈ ఘనతను కోహ్లీ 303 ఇన్నింగ్స్‌ల్లో సాధించగా, సచిన్ టెండూల్కర్‌కు 377 ఇన్నింగ్స్‌లు అవసరమయ్యాయి. ఈ మైలురాయిని అందుకునే సమయానికి సచిన్ సగటు 44.83 కాగా, కోహ్లీ సగటు ఏకంగా 59.13గా ఉండటం అతని నిలకడకు నిదర్శనం.37 ఏళ్ల వయసులో, కెరీర్ చరమాంకంలో ఉన్న కోహ్లీలో పరుగుల దాహం ఇంకా చావలేదని ఈ ఇన్నింగ్స్ నిరూపించింది. తన కెరీర్‌లోనే అత్యధికంగా 9 సిక్సర్లు బాదిన కోహ్లీ, తన పంథాను మార్చుకున్నాడనడానికి ఇదే నిదర్శనం. ముఖ్యంగా 14,000 నుంచి 15,000 పరుగుల మధ్య కేవలం 16 ఇన్నింగ్స్‌లు తీసుకున్న కోహ్లీ, 107.93 స్ట్రైక్ రేట్‌తో పరుగులు సాధించాడు. ఇది అతడి కెరీర్‌లోని ఏ ఇతర వెయ్యి పరుగుల బ్లాక్‌లోనూ లేదు.కోహ్లీ కేవలం పరుగుల వీరుడే కాదు, భారత క్రికెట్‌లో ఓ కొత్త సంస్కృతికి నాంది పలికిన యోధుడు. ఫిట్‌నెస్‌ను ఓ వాదనగా మార్చి, జట్టులో సరికొత్త ప్రమాణాలను నెలకొల్పాడు. ఆదివారం మరో ఎండ్‌లో శుభ్‌మన్ గిల్ (110) సాధించిన సెంచరీ.. కోహ్లీ వారసత్వానికి నిలువుటద్దం. మైలురాళ్లు ముఖ్యం కాదని, జట్టు అవసరాలే ప్రథమ కర్తవ్యమని మ్యాచ్ అనంతరం కోహ్లీ చెప్పాడు. 2027 ప్రపంచకప్ ఆడటమే తన లక్ష్యమని స్పష్టం చేశాడు. వయసును ఓ అస్త్రంగా మార్చుకుని, తన ఆటను కొత్త పుంతలు తొక్కిస్తున్న కోహ్లీ ప్రస్థానం.. కెరీర్ చరమాంకం ముగింపు కాదు, ఓ కొత్త ఆవిష్కరణకు నాంది అని చాటిచెబుతోంది.

# సీఎస్‌కే బౌలింగ్ కోచ్‌గా మోహిత్ శర్మ

**కోచింగ్ బృందంలో కీలక మార్పులు చేసిన చెన్నై సూపర్ కింగ్స్**

**గతంలో చెన్నై తరఫున కీలక బౌలర్‌గా రాణించిన మోహిత్**

**వరుస వైఫల్యాల నేపథ్యంలో కోచింగ్ బృందంలో మార్పులు**



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫ్రాంచైజీ చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) తమ కోచింగ్ బృందంలో కీలక మార్పులు చేస్తోంది. జట్టు నూతన బౌలింగ్ కోచ్‌గా టీమిండియా మాజీ పేసర్ మోహిత్ శర్మను నియమించనుంది. ఐపీఎల్ 2027 సీజన్ కోసం సీఎస్‌కే హెడ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన జహీర్ ఖాన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. రాబోయే వారాల్లో సహాయక సిబ్బందికి సంబంధించి మరిన్ని అధికారిక ప్రకటనలు వెలువడే అవకాశం ఉంది.గతంలో స్టీఫెన్ ఫ్లెమింగ్ ప్రధాన కోచ్‌గా ఉన్న సమయంలో బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించిన ఎరిక్ సిమన్స్ స్థానంలో 38 ఏళ్ల మోహిత్ శర్మ బాధ్యతలు స్వీకరించనున్నాడు. మోహిత్ శర్మకు చెన్నై ఫ్రాంచైజీతో సుదీర్ఘ అనుబంధం ఉంది. అతడు నాలుగు సీజన్ల పాటు సీఎస్‌కే తరఫున 48 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడటమే కాకుండా, ఛాంపియన్స్ లీగ్ టీ20లో 10 మ్యాచ్‌లకు ప్రాతినిధ్యం వహించాడు. 2025లో చివరిసారిగా ఐపీఎల్ ఆడిన మోహిత్, అదే ఏడాది డిసెంబర్‌లో క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. భారత్ తరఫున 8 టీ20 మ్యాచ్‌లు ఆడాడు.2023లో ఐదోసారి ఐపీఎల్ టైటిల్ గెలుచుకున్న సీఎస్కే, ఆ తర్వాత వరుసగా మూడు సీజన్లలో ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించడంలో విఫలమైంది. ఈ నేపథ్యంలో జట్టు ప్రదర్శనను మెరుగుపరిచే లక్ష్యంతో హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ స్థానంలో జహీర్ ఖాన్‌ను నియమించారు. జహీర్ నేతృత్వంలోని కొత్త కోచింగ్ బృందంలో మోహిత్ శర్మ నియామకం తొలి ప్రధాన మార్పు కావడం గమనార్హం.




## కోటి వ్యూస్‌తో బిజినెస్ సర్కిల్స్‌లో క్రేజ్ పెంచేసిన సత్యదేవ్ "సమవర్తి" సినిమా టీజర్

వైవిధ్యమైన చిత్రాల్లో నటిస్తూ హీరోగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు యంగ్ టాలెంటెడ్ హీరో సత్యదేవ్. ఆయన హీరోగా "సమవర్తి" అనే ఇంట్రెస్టింగ్ సినిమాలో నటిస్తున్నారు. సత్యదేవ్ హీరోగా నటిస్తున్న 16వ చిత్రమిది. "సమవర్తి" సినిమాను రుద్ర పిక్చర్స్ బ్యానర్ ౘ పంచభూత ప్రొడక్షన్స్, స్ పై శివచరణ్ రెడ్డి జక్కిడి, శశిధర్ రెడ్డి పడమటి నిర్మిస్తున్నారు. అజయ్ నాగ్. వి దర్శకత్వం వహిస్తున్నారు. ఎకోలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ గా తెరకెక్కుతున్న ఈ సినిమా త్వరలోనే తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళంలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. రీసెంట్ గా రిలీజ్ చేసిన "సమవర్తి" టీజర్ హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకుంది. ఈ టీజర్ కు ఇప్పటిదాకా కోటికి పైగా డిజిటల్ వ్యూస్ దక్కాయి. "సమవర్తి" టీజర్ బిజినెస్ సర్కిల్స్ లో మూవీపై క్రేజ్ పెంచేసింది. ఈ సినిమాకు భారీ స్థాయిలో బిజినెస్ ఎంక్వైరీస్ జరుగుతున్నాయి. టీజర్ లో పరిచయం చేసిన "సమవర్తి" ప్రపంచం ప్రతి ఒక్కరినీ మెస్మరైజ్ చేస్తోంది. సత్యదేవ్ కెరీర్ లో ఇదొక స్పెషల్ మూవీ అవుతుందనే అంచనాలు టీజర్ తోనే ఏర్పడ్డాయి. మేకర్స్ ఈ చిత్రాన్ని ఈ ఏడాదిలోనే రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మరిన్ని ఎగ్జైటింగ్ అప్డేట్స్ తో ప్రేక్షకుల్ని ఆకట్టుకునేందుకు "సమవర్తి" టీమ్ సన్నద్ధమవుతోంది. నటీనటులు - సత్యదేవ్, శ్రీకాంత్, దిలీష్ పోతన్, రాజీవ్ కనకాల, గానవి లక్ష్మణ్, రవీంద్ర విజయ్, మోహన్ భగత్, తదితరులు

## తేజ సజ్జ హోస్ట్‌గా అమెజాన్ ప్రైమ్ వీడియోలో 'ది ట్రైటర్స్'.. ఆసక్తికరంగా ప్రోమో!



అమెజాన్ ప్రైమ్ వీడియో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన ప్రముఖ ఇంటర్నేషనల్ రియాలిటీ గేమ్ షో 'ది ట్రైటర్స్' ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్ ద్వారా టాలెంటెడ్ యంగ్ హీరో తేజ సజ్జ రియాలిటీ షో హోస్ట్‌గా అరంగేట్రం చేస్తున్నారు. ఈ మేరకు ప్రైమ్ వీడియో సంస్థ అధికారిక ప్రకటనతో పాటు ఒక ఆసక్తికరమైన ప్రోమోను కూడా విడుదల చేసింది. ఈ హై-వోల్టేజ్ గేమ్ షో పూర్తిగా మోసాలు, వ్యూహాలు, రహస్య కూటములు మరియు ఊహించని మలుపుల ఆధారంగా సాగుతుంది. ఇందులో కొందరు కంటెస్టెంట్స్ ఇన్నోసెంట్స్‌గా ఉంటే, మరికొందరు ట్రైటర్స్‌గా వ్యవహరిస్తారు. ట్రైటర్స్ ఎవరనేది కనిపెట్టడానికి ఇన్నోసెంట్స్ చేసే ప్రయత్నాలు, మధ్యలో జరిగే ఉత్కంఠభరితమైన డ్రామా ప్రేక్షకులను ఎంతగానో అలరించనుంది. ఈ షో అక్టోబర్ 15 నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమింగ్ కానుంది.

## పులిలా వచ్చిన ఎన్టీఆర్.. చిత్రబృందం ఏర్పాట్లు అదుర్స్



ఫహాద్ ఫాజిల్ హీరోగా రానున్న చిత్రం 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'. శశాంక్ యేలేటి దర్శకత్వం వహించారు. సారా పాలేకర్, సౌరభ్ సచ్దేవా కీలక పాత్రల్లో నటించారు. ఎస్.ఎస్.రాజమౌళి, కార్తికేయ నిర్మాణ భాగస్వామ్యంతో రూపొందించారు. ఈ సినిమా అక్టోబర్ 2న తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. దీనికి సంబంధించిన ప్రీరిలీజ్ ఈవెంట్ ఈ రోజు ( మంగళవారం)హైదరాబాద్‌లో నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఎన్టీఆర్ హాజరయ్యారు. చాలా కాలం తర్వాత రావడంతో చిత్ర బృంద వినూత్నంగా ఏర్పాట్లు చేసింది. స్క్రీన్‌పై 'యమదొంగ' సీన్‌ని రీక్రియేట్ చేసింది. ఒక్కసారిగా అలా ఎన్టీఆర్ రావడంతో ఈవెంట్‌లో ఎన్టీఆర్.. ఎన్టీఆర్ అంటూ అభిమానులు అంతా మార్మోగేలా అరిచారు. ఇప్పుడీ వీడియో వైరల్ అవుతోంది.

## ఏఐపై రాజమౌళి క్లారిటీ.. ఇకపై సినిమా అలా ఉండదట!



నేటి ఆధునిక ప్రపంచంలో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం రోజురోజుకీ విస్తరిస్తోంది. ముఖ్యంగా ఏఐతో రూపొందిస్తున్న వీడియోలు, పోస్టర్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారుతున్నాయి. సినిమా రంగంలోనూ ఏఐ ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో.. దీనిపై అగ్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

ఏఐ గంటల్లో, నిమిషాల్లో పూర్తి చేస్తోంది

జార్జియా యూనివర్సిటీ విద్యార్థులతో మాట్లాడిన రాజమౌళి.. సినిమా రంగంలో ఏఐ వినియోగం, దాని ప్రభావం గురించి వివరించారు. 'ఏఐ భవిష్యత్తు గమనం ఎలా ఉంటుందో ఊహించడం చాలా కష్టం. సాంకేతికత, దాని వినియోగాలు వేగంగా విస్తరిస్తున్నాయి. అయితే ఒక ప్రాజెక్ట్‌కు సంబంధించి పరిశోధన, అభివృద్ధి వంటి ప్రాథమిక పనులకు ఏఐ అద్భుతమైన సాధనం. గతంలో వారాలు, నెలలు పట్టే పనులను ఇప్పుడు ఏఐ గంటల్లో, నిమిషాల్లో పూర్తి చేస్తోంది' అని అన్నారు. ఇకపై సినిమా చాలా తొందరగా పూర్తిచేసేందుకు అవకాశముందన్నారు. సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం తాము ప్రాథమిక సమాచారాన్ని అభివృద్ధి చేసుకునేందుకు ఏఐని సహాయక సాధనంగా మాత్రమే ఉపయోగిస్తున్నామని రాజమౌళి తెలిపారు. డిజిటల్ కంటెంట్, సినిమా నిర్మాణంలో ఏఐపై ఆధారపడటం లేదని స్పష్టం చేశారు. ఇక మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి తెరకెక్కిస్తున్న వారణాసి చిత్రంలో కీలక సన్నివేశాలను మోషన్ క్యాప్చర్ సాంకేతికతతో ఇప్పటికే చిత్రీకరించినట్లు తెలుస్తోంది. ఈ సినిమా చిత్రీకరణ సింహభాగం పూర్తయినట్లు సమాచారం. ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. ఈ సినిమాను 50 భాషల్లోకి అనువదించి, 120 దేశాల్లో విడుదల చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

## విడుదలకు ముందే షాక్.. ఆన్‌లైన్‌లో 'తెల్లకాగితం' సినిమా కంటెంట్ లీక్!



అక్టోబర్ 2న అట్టహాసంగా థియేటర్లలో విడుదల కావాల్సిన టాలీవుడ్ సినిమా 'తెల్లకాగితం' చిత్ర యూనిట్‌కు భారీ షాక్ తగిలింది. సినిమా విడుదలకు కేవలం మూడు రోజుల సమయం మాత్రమే ఉండగా.. ఈ చిత్రానికి సంబంధించిన కీలకమైన కంటెంట్ ఆన్‌లైన్‌లో లీక్ కావడం సినీ వర్గాల్లో కలకలం రేపింది. ఈ అనూహ్య పరిణామంతో చిత్ర నిర్మాతతో పాటు టెక్నీషియన్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అయితే ఈ వ్యవహారంపై స్పందించిన 'తెల్లకాగితం' చిత్ర యూనిట్ సోషల్ మీడియా వేదికగా తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. సినిమాకు సంబంధించిన లీకైన కంటెంట్‌ను ఎవరూ డౌన్‌లోడ్ చేయవద్దని, సోషల్ మీడియాలో షేర్ చేయవద్దని మరియు ఇతరులకు సర్క్యులేట్ చేయవద్దని ప్రేక్షకులను హృదయపూర్వకంగా కోరింది. మా చిత్రం 'తెల్లకాగితం'కు సంబంధించిన కంటెంట్ అనుమతి లేకుండా ప్రచారం చేయబడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఈ సినిమా కంటెంట్‌ను చట్టపరంగా లీక్ చేయడాన్ని, షేర్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాము.

PUBLISHED AND OWNER BY LINGALA NARENDER Published at 10-1-1-/A, THIRUMURTHY COLONY,PRIYADARSHINI PARK BESIDE,SAROOR NAGAR,RANGAREDDY District TELANGANA - 500035. Printed at SMILYSONLINE 6-7-48,VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY District,TELANGANA - 500070. EDITOR LINGALA NARENDER RNI NO. : TGTEL/25/A0357 ,CELL : 9010880040